MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 2 రంగారెడ్డి అక్టోబర్ 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## మదురైలో ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐ తో అనుసంధానం ! అనుసంధానకర్త ఏపిమాస్!!




సదస్సులో ప్రసంగిస్తున్న ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి

## అమెరికాలో ముమ్మరంగా ఏపిమాస్ ప్రచారోద్యమం!









నాబార్డ్ – ది హిందూ ఆంగ్ల పత్రిక 'బిజినెస్‌లైన్'ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చిరుధాన్యాల మహోత్సవం! సభలో ప్రసంగిస్తున్న నాబార్డ్ ఛైర్మన్ శ్రీ షాజీ కె వి

## ఎస్ హెచ్ జి సమాఖ్యల జాతీయ మహోత్సవం !

## ఏపిమాస్ ఆధ్వర్యంలో ... వరుసగా మూడవ ఏడాది

## ఉత్తమ సమాఖ్యలకు 10-11 తేదీలలో పురస్కారాలు !



హైదరాబాద్‌లో ఫుడ్ మేళాలో ఒక దృశ్యం



ఏపిమాస్ ఆధ్వర్యంలో 20 ఎన్ జి ఓల ప్రతినిధులు పాల్గొన్న ధ్వని ఫౌండేషన్ 'నిరంతర్ సహాయక్' అవగాహన కార్యక్రమం




ఆరు రాష్ట్రాల ఎఫ్ పి ఓలు,సి బి బి ఓల ప్రతినిధులకు 5 రోజులపాటు ఏపిమాస్ శిక్షకులకు శిక్షణ కార్యక్రమం

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు



# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 2




సంపాదకీయం

## అభినందనం !

ఒక తరగతిలో 30-40 మంది విద్యార్థులు వుంటే, ఉపాధ్యాయుడో, ఉపాధ్యాయురాలో అందరికీ ఒకే పాఠం, ఒకే విధంగా చెబుతారు. కాని ఆ పాఠాన్ని వినే విద్యార్థులలో కొందరు ఆసక్తి లేక, దానిని సరిగా వినిపించుకోక, అర్థంచేసుకోలేక, దాని సారాంశాన్ని అందిపుచ్చుకోలేక, చదువులో ముందడుగు వేయలేక, చతికిలపడి పోతారు. మరికొందరు విద్యార్థులు మాత్రం ఆ పాఠాన్ని ఆసక్తితో విని, బాగా అర్థంచేసుకుని, దానికి తమ పరిధిలోని ఉదాహరణలను జోడించుకుని, తమ అవగాహనను మరింత పెంచుకుని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటారు. ఏ విషయంలోనైనా యింతే. ఇతరేతర కారణాలు కొన్ని వున్నప్పటికి ప్రధానంగా ఆసక్తి, అవగాహన, అంకితభావం, అభివృద్ధి చెందాలన్న తపన వుండడం, వుండకపోవడమనేవే ముందడుగును, వెనకడుగును నిర్ణయిస్తాయి. ఇతరేతర కారణాలు అనుకున్నవాటిలో ప్రోత్సాహం ప్రధానపాత్ర వహిస్తుంది. తగిన ప్రోత్సాహం వుంటే మందబుద్ధికూడా, మహామేధావి కావచ్చు. ఆ ప్రోత్సాహమే లేక, ప్రతిభాశాలికూడా మందబుద్ధిగా మారవచ్చు. ఇది స్వయంసహాయ వ్యవస్థకు, ఉద్యమానికి కూడా పూర్తిగా వర్తిస్తుంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వయంసహాయ ఉద్యమం మహోజ్వలంగా ఒక వెలుగు వెలిగింది. మొత్తం దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. మనదేశంలోని యితర రాష్ట్రాలకే కాదు, కొన్ని యితర దేశాలకు కూడా పాఠాలు నేర్పే స్థాయికి ఎదిగింది. ఎన్ని ప్రయోగాలు, ఎన్ని నవీకరణలు, ఎన్నెన్ని అనుభవాలు ! వీటన్నిటిలో కీలక భాగస్వామిగా వుండగలగడం ఏపిమాస్‌కు ఆనందంతోపాటు, గర్వకారణమైన విషయం. ఐతే, కాలపరీక్ష చాలా కఠినమైనది. దానిని తట్టుకుని నిలవడం అంత సులువేం కాదు. ఆపై కొత్తగా మరిన్ని మెట్లెక్కడం మరీ కష్టం. ప్రవాహపు నీరు పాచిపట్టదు. నిలువనీటికి పాచి తప్పదు. మన దేశంలో, మరీ ముఖ్యంగా ఆది నుంచి అగ్రగామిగా వున్న మన తెలుగు రాష్ట్రాలలో స్వయంసహాయ రంగం చాలావరకు నిత్యనూతన ప్రవాహ తత్వాన్ని కోల్పోవడంతో , చైతన్య రాహిత్యం ఆవహించి, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. కారణాలు అనేకం. కేవలం కారణాలను అన్వేషిస్తే సరిపోదు, వాటిని విశ్లేషించి తగిన పరిష్కారాలను కనుగొనగలగాలి. ముందే అనుకున్నట్టు తగిన ప్రోత్సాహం, మెచ్చుకోలు వుంటే కొంత జడత్వం వదులుతుంది, ముందడుగు వేయాలన్న ఆసక్తి కలుగుతుంది. మళ్ళీ ఆ ఆసక్తిని మేల్కొలిపితే చాలు, అద్భుతాలు సృష్టించడానికి! అందుకే, నాడు స్వయంసహాయ ఉద్యమానికి ఊపిరులూదిన ఏపిమాస్ మళ్ళీ ఆ ప్రోత్సాహ బాధ్యతను తనంతతానుగా నెత్తికెత్తుకున్నది. స్వయంసహాయ రంగంలో స్తబ్దతను పోగొట్టి తిరిగి, నూతన చైతన్యాన్ని రగిలించడానికి, మరో వైభవోజ్వల చరిత్ర దిశగా స్వయంసహాయ రంగాన్ని సమాయత్తంచేయడానికి నడుంకట్టింది. ఇప్పటికి మూడేళ్ళుగా మొత్తం దేశంలోని స్వయంసహాయ సమాఖ్యలలో ఉత్తమోత్తమ నిర్వహణతో, ఆదర్శప్రాయంగా మున్ముందుకు సాగుతున్న స్వయంసహాయ సమాఖ్యలను కొన్ని ప్రామాణికాల ఆధారంగా గుర్తించి, వాటికి అభినందన చందనాలు, పురస్కార సత్కారాలు అందిస్తున్నది. వరుసగా మూడవ ఏడాది ఈ స్వయం సహాయ ప్రోత్సాహక మహాక్రతువును ఈ అక్టోబర్ 10-11 తేదీలలో హైదరాబాదులో నిర్వహిస్తున్నది. ఈ పురస్కార మహోత్సవంలో పాల్గొనడానికి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సమాఖ్యలు ముందుకు వస్తుండడం సంతోషదాయకంగా వుంది. వందలాదిగా అభివృద్ధిరంగ నిపుణులు, విషయ ప్రవీణులు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల ప్రధాన ప్రతినిధులు పాల్గొనే సదస్సులలో ఈ సమాఖ్యల సభ్యులు, పదాధికారులు, కార్యనిర్వాహకులు పాల్గొని , సన్మానాలు పొందడం, ప్రశంసా పత్రాలు అందుకోవడం ఎంతో ఉత్సాహంగా, ఉద్వేగభరితంగా వుంటుంది. ఈ ఉద్వేగం, ఆనందం, విజయోత్సాహం వివిధ కారణాలతో మందకొడిగా వున్న అనేక ఇతర సమాఖ్యలకు ప్రేరణ కావాలని, అవి కూడా తమ నిస్తేజాన్ని వదిలించుకుని, చైతన్యాన్ని సంతరించుకుని, క్రియాశీలంగా, ప్రభావోత్పాదకంగా అనేక ముందడుగులు వేయాలన్నదే ఈ సన్మానాల సదాశయం. వచ్చే సంవత్సరం నాటికి ఈ పురస్కారాలు లెక్కకు మిక్కిలిగా పెరగాలని ఆశిస్తూ, విశ్వసిస్తూ, ఆనందాలు నింపే ఆ మంచి రోజుకోసం ఎదురుచూస్తూ .... మీ ....


Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**


బంగారు పాత్రలోని విషం కంటె మట్టి ముంతలోని తేనె మేలుకదా!

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. కృష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సాంకేతిక సహకారం : వి. శశివర్ధన్ సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి

**లోపలి పేజీలలో ....**

➪ అమెరికాలో ఏపిమాస్ ప్రచారోద్యమం! ...05
➪ ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు సన్మానానికి సిద్ధం! ...08
➪ తమిళ ఎఫ్ పి ఓలకు ఎస్ బిఐతో అనుసంధానం ...09
➪ నాబార్డ్‌చే హైదరాబాదులో చిరుధాన్యాల ఉత్సవం...10
➪ సిజిఎంచే ఆదిలాబాద్ ప్రాజెక్టుల సందర్శన ...11
➪ స్వామినాధన్ కన్నుమూత ...12
➪ ఎఫ్‌పిఓ, వ్యవసాయ సిబ్బంది సమావేశం ...14
➪ గోదాము, కార్యాలయ నిర్మాణానికి ధరణి తీర్మానం...16
➪ భారంలేని బోధన...జీవిత పాఠాల అధ్యయనం ...18
➪ భూమాత వార్షిక మహాసభ ...22
➪ రైతు వికాస సమాఖ్య ద్వితీయ వార్షిక మహాసభ ...23
➪ ఎ టి ఎం ప్రకృతి వ్యవసాయ ంలో లాభాలు ...24
➪ సుస్థిర వ్యవసాయంతోనే ఆహార భద్రత ...26
➪ సీబీఎస్‌ఈ 'ఒకే ఆడసంతానం' స్కాలర్‌షిప్ ...27
➪ ఎఫ్‌పిఓల సుస్థిరతకు రోలింగ్ ప్రణాళిక ...28
➪ కర్నూలు క్లస్టర్‌లో వాష్ కార్యక్రమాలు ... ...30
➪ ఆరువేలమందిని చదివిస్తున్న పోలీసు ...32
➪ మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం...34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

సూర్యోదయం అవకాశాలను అందిస్తుంది, సూర్యాస్తమయం ఆ అవకాశాలను ఏంచేశావని నిలదీస్తుంది

# అమెరికాలో విజయవంతంగా ఏపిమాస్ ప్రచారోద్యమం!

## ఏడు నగరాలలో దాదాపు నెలరోజులపాటు శ్రీ సి ఎస్ రెడ్డి సమావేశాలు

**22 ఏళ్ళుగా అభివృద్ధి రంగంలో ఏపిమాస్ సాగిస్తున్న విశిష్ట కృషిని, ముఖ్యంగా మహిళా సాధికారతకు, పేదరిక నిర్మూలనకు చేస్తున్న నిర్విరామ సేవలను, సాధించిన ఫలితాలను అమెరికాలోని భారతీయులకు పరిచయం చేయడం, భారతదేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అండదండలు అందించే విషయంలో అమెరికాలోని భారతీయుల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకోవడం, అమెరికాలో ఏపిమాస్‌కు భాగస్వామ్యాలను సమకూర్చడం, వనరులను సమీకరించడం కోసం కనీసం 10 అమెరికన్ నగరాలలో 'ఏపిమాస్ యు ఎస్ ఏ' ఛాప్టర్లను ఏర్పాటు చేయడం ముఖ్య లక్ష్యాలుగా ఏపిమాస్ సి ఇ ఓ, ఎం డి శ్రీ సి ఎస్ రెడ్డి 2023 ఆగస్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు అమెరికా పర్యటన సాగించి, తన స్నేహితులు, ఏపిమాస్ శ్రేయోభిలాషుల తోడ్పాటుతో ఏడు నగరాలలో పెక్కు సమావేశాలలో పాల్గొని, విస్తృతంగా చర్చోపచర్చలు సాగించి, తన పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాదు చేరుకున్నారు. అమెరికాలో తన పర్యటన విశేషాలను ఆంగ్లంలో ఒక నివేదిక రూపంలో సవివరంగా ఆయన తెలియజేశారు. ఆ నివేదిక సారాంశాన్ని 'మహిళా సాధికారత' పాఠకులకోసం క్లుప్తంగా తెలుగులో అందిస్తున్నాం...**

---

ఏపిమాస్‌కు అమెరికాలోని భారతీయుల సహాయ సహకారాలను చట్టబద్ధంగా పొందాలన్న ఆలోచన గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నది. శ్రీ సి ఎస్ రెడ్డి అమెరికా మిత్రుడు శ్రీ ఏ ఎల్ నరసింహారెడ్డి ప్రోత్సాహంతో అమెరికాలోని ఏపిమాస్ మిత్రబృందం 'బెనివిటి' అనే దాతృత్వ సంస్థ వేదికగా ఏడెనిమిదేళ్ళుగా ఏపిమాస్‌కు కొద్దిపాటి విరాళాలను అందజేస్తూ వస్తున్నది. ఈ పరిణామాన్ని దృష్టిలో పెట్టుకుని ఏపిమాస్ పాలక వర్గం ఏపిమాస్ సంస్థను అమెరికాలో నమోదు చేయించి, గణనీయంగా అమెరికా విరాళాలకు



మార్గం సుగమం చేయాలని యోచించింది. కోవిడ్ అంతరాయం వంటి పరిణామాలతో కొంత జాప్యం జరిగినా, 2022 లో హ్యూస్టన్ నగరంలోని శ్రీ గొల్లా శ్రీనివాస్ యిల్లు కేంద్ర కార్యాలయంగా లాభార్జన దృష్టిలేని సంస్థగా 'ఏపిమాస్ యుఎస్ఏ' ఏర్పాటైంది. అప్పటినుంచి అమెరికాలో ఏపిమాస్ ప్రచార నిర్వహణకు శ్రీ ఎస్ రెడ్డి అక్కడ పర్యటించాలన్న ఆలోచన యిప్పటికి కార్యరూపం దాల్చింది.

శ్రీ సి ఎస్ రెడ్డి ఆగస్టు 28 వతేదీన అమెరికాలో అడుగుపెట్టారు. ఆయన మిత్రులు ఆయనకు స్వాగతం పలికి, భోజన వసతి ఏర్పాట్లు చక్కగా చేశారు. మిత్రబృందంతో కొన్ని వ్యక్తిగత కార్యక్రమాల తర్వాత సెప్టెంబర్ ఒకటవ తేదీన కాలిఫోర్నియా లోని ఇర్విన్‌లో శ్రీ సి ఎస్ తన అధికారిక కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఇర్విన్ (లాస్ ఏంజిలిస్) సమావేశం :** సెప్టెంబర్ ఒకటవ తేదీన జరిగిన ఈ సమావేశంలో 20 మంది వరకు పాల్గొన్నారు. శ్రీ హరి కట్టా స్వాగతోపన్యాసంతో మొదలైన ఈ సమావేశానికి శ్రీ రవి పెందుర్తి మాడరేటర్‌గా వ్యవహరించారు. శ్రీ సి ఎస్ రెడ్డి గత 22 సంవత్సరాలుగా ఏపిమాస్ సాగిస్తున్న కృషిని,



నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టుల గురించి వివరించి, అమెరికా నుంచి అందే విరాళాలతో ఏపిమాస్ ఏ కార్యక్రమాలను చేపట్టాలని భావిస్తున్నదో తెలియజేశారు.

శ్రీ సి ఎస్ వివరిస్తుండగా సమావేశంలో పాల్గొన్న వారు ఎన్నో ప్రశ్నలు వేశారు. ఇండియాలో ఏపిమాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి, గ్రామాలలో, మురికివాడలలో ప్రాజెక్టులను ఎలా నిర్వహించేది, ఆశించిన ఫలితాలు ఎలా సాధిస్తారో తెలుసుకోవాలని వారు కుతూహలం వ్యక్తం చేశారు. మొత్తంమీద సమావేశంలో పాల్గొన్నవారందరూ సమావేశం జరిగిన తీరుపట్ల సంతృప్తి వ్యక్తంచేశారు.

**రెండవ కార్యక్రమం క్యూపెర్టినో సిటి (బే ఏరియా):**

శ్రీ ఏ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో 'కాల్ టు కామన్‌సెన్స్ యాక్షన్ ఆధ్వర్యంలో అమెరికాలో ఏపిమాస్ రెండవ సమావేశం క్యూపెర్టినో సిటిలో సెప్టెంబర్ 2వ తేదీన జరిగింది. ఎస్ బి 403 అనే స్థానిక చట్టానికి వ్యతిరేకంగా ఏపిఎన్ఏడిబి అనే సంస్థ నిర్వహించే కార్యక్రమంతోపాటు ఏపిమాస్ ప్రచార కార్యక్రమం ఇదే సభలో నిర్వహించారు.

కొందరు ప్రజా ప్రతినిధులతోసహా దాదాపు 50 మంది పాల్గొన్న ఈ సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి ఏపిమాస్ కార్యక్రమాలను గురించి వివరించారు. అనంతరం పది నిమిషాలపాటు ప్రశ్నోత్తరాలతోపాటు, పలువురు శ్రీ సి ఎస్ ను కలుసుకుని ఏపిమాస్ కార్యక్రమాలపట్ల ముఖ్యంగా మహిళా సాధికారత, ప్రకృతి వ్యవసాయం మొదలైన అంశాల పట్ల ఆసక్తి వ్యక్తంచేశారు.

**మూడవ సమావేశం హ్యూస్టన్‌లో ...**

సెప్టెంబర్ 10వ తేదీన హ్యూస్టన్‌లో ఏపిమాస్ యు ఎస్ ఏ అధికారిక కార్యాలయమైన శ్రీ గొల్లా శ్రీనివాస్ ఇంటిలో మూడవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 33 మంది పాల్గొన్నారు. పురుషుల, మహిళల ప్రాతినిధ్యం దాదాపు సమానం. హ్యూస్టన్‌కు చెందిన పెక్కు కంపెనీల సి ఇ ఓలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఏపిమాస్ కార్యక్రమాల గురించి శ్రీ సి ఎస్ రెడ్డి వివరించిన తర్వాత వారంతా ఏపిమాస్ చేస్తున్న మంచి పనులకు తమ మద్దతు ప్రకటించారు. ఇండియాలో మహిళలలో రక్తహీనతను, పిల్లలలో పోషకాహార లోపాన్ని సవరించడానికి తాము స్వచ్ఛంద సేవలను , అండదండలను అందిస్తామని పలువురు ముందుకు రావడం విశేషం.

**నాల్గవ కార్యక్రమం అట్లాంటాలో ...**

సెప్టెంబర్ 12 వ తేదీన శ్రీ సి ఎస్ రెడ్డి అట్లాంటాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అమెరికాలో భారతీయ అమెరికన్ల నిర్వహణలోని పిరమిడ్ ఐ టి కన్సల్టింగ్ అనే పెద్ద కంపెనీ వ్యవస్థాపకులలో ఒకరైన శ్రీ రమేష్ మాటూరుతో, శ్రీ సి ఎస్ రెడ్డి చర్చించారు.

శ్రీ రమేష్ 'విభా' అనే కంపెనీ ద్వారా ఇండియాలో విద్యారంగంలో అనేక ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఏపిమాస్ కార్యక్రమాలు నచ్చిన శ్రీ రమేష్ విద్యా కార్యక్రమాలు చేపట్టడానికి ఏపిమాస్‌కు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ యిచ్చారు.

ఆ సాయంత్రం ఆల్ఫరెట్టాలో శ్రీ గురు ఒక చిన్న సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాల్గొన్నది కేవలం ఆరుమందే అయినప్పటికి, చర్చ చక్కగా సాగింది. భారీ సంఖ్యలో నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు గురించి, విద్య నాణ్యతను పెంచడాన్ని గురించి ఆసక్తి వ్యక్తమైంది.

ఏపిమాస్ యు ఎస్ ఏ ఈ ప్రాంతం లోని వివిధ తెలుగు అసోసియేషన్లతో కలసి పని చేయడానికి సుముఖమేనా అన్న ప్రశ్న వచ్చింది. అందుకు అనుగుణంగా ఒక డిజిటల్ గోష్ఠిని నిర్వహించడానికి శ్రీ గురు సంసిద్ధత వ్యక్తం చేశారు.

**కేర్ అమెరికా 30 వసంతాల ఉత్సవం**

సెప్టెంబర్ 13 వ తేదీన అట్లాంటాలో కేర్ అమెరికా 30 వసంతాల ఉత్సవంలో శ్రీ సి ఎస్ పాల్గొన్నారు.

ఆశించినవి అందకపోవడం, అనుకోనివి ఎదురుకావడం జీవితంలో భాగమే

ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ గా రాకముందు 12ఏళ్ళ పాటు శ్రీ సి ఎస్ రెడ్డి కేర్ ఇంటర్నేషనల్, ఇండియాలో బాధ్యతాయుతమైన పదవిని నిర్వహించారు. వందమంది కేర్ ప్రతినిధులు పాల్గొన్న ఆ సమావేశంలో తన పాత మిత్రులతో, ఇతరులతో ఆయన ఏపిమాస్ యు ఎస్ ఏ స్థాపన ఉద్దేశాన్ని గురించి, తన అమెరికా పర్యటన లక్ష్యాన్ని గురించి వివరించారు. కేర్ యు ఎస్ ఏ లో పదవీ విరమణ చేసిన కొందరిని ఏపిమాస్ యు ఎస్ ఏ కు నిధుల సమీకరణ కోసం వినియోగించుకోవచ్చునని శ్రీ సి ఎస్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**5 వ సమావేశం వాషింగ్టన్ డి సి లో ...**

వాషింగ్టన్ డి సి ప్రాంతంలోని కొలంబియాలో రాయల్ తాజ్ రెస్టారెంట్‌లో ఈ సమావేశం జరిగింది. శ్రీ సి ఎస్ రెడ్డితో కలసి చదువుకున్న శ్రీ చంద్ర ఈ గెట్ టు గెదర్ నిర్వహించారు. పాల్గొన్నది ఎనిమిది మందే అయినప్పటికి, అది ఏపిమాస్ కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమం కానప్పటికి, ఏపిమాస్ ఫ్లయర్ చదివి, ఏపిమాస్ కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ, పలువురు శ్రీ సి ఎస్ తో మాట్లాడారు. ఇక్కడ వ్యక్తమైన ఆసక్తిని గమనించిన శ్రీ చంద్ర, శ్రీ రామమోహన్ తాము త్వరలో విస్తృతస్థాయిలో వర్చువల్ సమావేశమైనా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

**6 వ కార్యక్రమం రీసెర్చ్ ట్రయాంగిల్ లో ...**

రాలే దర్హామ్ చాపెల్ హిల్ ను రీసెర్చ్ ట్రయాంగిల్ అని కూడా అంటారు. ఇది అధికారిక సమావేశం కానప్పటికి, శ్రీ సి ఎస్ రెడ్డి ఆ ప్రాంతంలోని తన మిత్రులతో, బంధువులతో ఏపిమాస్ ప్రచారోద్యమం గురించి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

**7 వ సమావేశం న్యూజెర్సీ లో ...**

న్యూజెర్సీలోని ప్లయిన్స్ బోరో పెప్పర్ హౌస్‌లో సెప్టెంబర్ 23 వ తేదీన ఈ కార్యక్రమాల శ్రేణిలో ఆఖరిదైన ఏడవ సమావేశం జరిగింది. శ్రీ చక్రధర్, శ్రీ ద్వారక, శ్రీ రమణారెడ్డి, శ్రీమతి అనూరాధ, శ్రీ కోటి జాలాది ఈ సమావేశం ఏర్పాటుకు కృషి చేశారు. దాదాపు 30మంది పాల్గొన్న ఈ సమావేశంలో



ఏపిమాస్ కార్యక్రమాల గురించి శ్రీ సి ఎస్ రెడ్డి వివరించిన వెంటనే, వారినుంచి చాలా సానుకూల ప్రతిస్పందన కనిపించింది. రైతులకు, వారి సమాఖ్యలకు ఉపయోగపడే కార్యక్రమాలపట్ల, శుద్ధిచేసిన నీటిని సరఫరా చేసే కార్యక్రమాల నిర్వహణ గురించి ఆసక్తి వ్యక్తమైంది. ఆనేక తెలుగు అసోసియేషన్ల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. భాగస్వామ్య పద్ధతిలో ప్రాజెక్టులను చేపడితే తమ పూర్తి మద్దతును ఏపిమాస్ కు అందిస్తామని వారు చెప్పారు.

అంతకు ముందు అరబిందో సహ వ్యవస్థాపకులు శ్రీ రామప్రసాదరెడ్డిని న్యూజెర్సీలోని ఆయన నివాసంలో శ్రీ సి ఎస్ రెడ్డి కలుసుకున్నారు. ఏపిమాస్ యు ఎస్ ఏ కు సహకారం అందించడానికి ఆయన అంగీకరించారు. నిజానికి ఐదేళ్ళ క్రితమే శ్రీ రామప్రసాదరెడ్డి ఏపిమాస్ యు ఎస్ ఏ ను ఏర్పాటుచేస్తే తాము అండగా వుంటామని చెప్పారు.

అమెరికాలో ఏపిమాస్ ఈ తొలి ప్రచార యాత్ర నూటికి నూరు శాతంపైగా విజయవంతమైందంటే, దానికి అమెరికా లోని శ్రీ సి ఎస్ రెడ్డి మిత్రబృందం, వారి కుటుంబ సభ్యులు అందించిన తోడ్పాటు, నిర్విరామ కృషి, ఆత్మీయ సహకారం, ఒక ఉదాత్త ఆశయంపట్ల అంకితభావం ప్రధాన కారణాలు. వారందరికి పేరుపేరునా శ్రీ సి ఎస్ రెడ్డి ఆత్మీయ ధన్యవాదాలు తెలిపారు.

ఈ విజయం సంపూర్ణం కావాలంటే, ఆంతే చిత్తశుద్ధితో, అంకితభావంతో వ్యూహాత్మకంగా అనంతర చర్యలు చేపట్టవలసి వుంది. ఆ అనంతర చర్యలకు ఏపిమాస్ యిప్పటినుంచే సన్నద్ధమవుతున్నది.

■

# ఎస్ హెచ్ జి సమాఖ్యలకు సన్మానానికి సర్వం సిద్ధం!

– జి.శ్రీనివాస్



*ఇది 2022 లో ఉత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్యలకు పురస్కార ప్రదానోత్సవ దృశ్యం*

ఏపిమాస్ , ఎనేబుల్ నెట్ వర్క్ సంయుక్తంగా నాబార్డు తోడ్పాటుతో 2021వ సంవత్సరంలో ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు జాతీయ పురస్కారాలను ప్రవేశపెట్టాయి. భారతదేశంలో నిర్వహణపరంగా అత్యుత్తమ ఎస్ హెచ్ జి సమాఖ్యలను గుర్తించి, గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలు ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం కూడా ఏపిమాస్ సంస్థ, ఎనేబుల్ నెట్‌వర్క్ సంయుక్తంగా డి.జి.ఆర్.వి, యస్.బి.ఐ, యఫ్.డబ్ల్యు.డబ్ల్యు.బి, ప్రాదాన్ సంస్థల తోడ్పాటుతో ఎస్ హెచ్ జి సమాఖ్యలకు తృతీయ వార్షిక పురస్కారాలను అందజేయడానికి రంగం సర్వం సిద్ధమైంది.

భారతదేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఎస్‌హెచ్‌జి సమాఖ్యలకు జాతీయస్థాయి సదస్సును నిర్వహించి పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని 2023 అక్టోబర్ 10, 11 తేదీలలో హైదరాబాదులోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహిస్తారు.

జాతీయ స్థాయిలో రెండు సమాఖ్యలు (కేరళ రాష్ట్రం–1, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము–1), ప్రాంతీయస్థాయిలో ఐదు సమాఖ్యలు (మహారాష్ట్ర –2, రాజస్థాన్ –1, ఆంధ్రప్రదేశ్ –2) ఒక సమాఖ్యకు (రాజస్తాన్ –1) ప్రత్యేక కేటగిరి పురస్కారం, యింకా ప్రాంతీయ స్థాయిలో నాలుగు సమాఖ్యలకు (ఆంధ్రప్రదేశ్–1, తెలంగాణ–1, బీహార్–2). ప్రశంసాపత్రాలు (లెటర్ అఫ్ అప్రిసియేషన్) అందజేస్తారు.

ప్లీనరీ చర్చలు, రాష్ట్రాల వారీగా ఆయా భాషలు మాట్లాడే సభ్యులను గ్రూపులుగా చేసి జాతీయ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించనున్నారు. ఈ రెండు రోజుల సదస్సులో భారతదేశంలోని నలుమూలల నుంచి ఎస్ హెచ్ జి సమాఖ్యల మహిళా సభ్యులు, సిబ్బంది, ప్రోత్సాహక సంస్థల వారు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు దాదాపు 200 మంది హాజరు కానున్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర, రాష్ట్రస్థాయి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. ■

# తమిళనాడు ఎఫ్ పి ఓలకు ఎస్ బి ఐతో అనుసంధానం !

రైతు ఉత్పత్తిదారు సంస్థల (ఎఫ్ పి ఓల) రుణ అవసరాలను తీర్చడం లక్ష్యంగా ఎఫ్ పి ఓలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ బి ఐ)తో అనుసంధానంకోసం రాష్ట్రస్థాయి కార్యశాలలను ఏపిమాస్ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమాలను ప్రారంభించిన మొదటి నెల 2023 ఆగస్టులోనే ఏకంగా మూడు రాష్ట్రాలలో ఈ అనుసంధాన సదస్సులను నిర్వహించడం ఏపిమాస్ కు గర్వకారణమైన విషయం. ఈ కార్యాచరణలో భాగంగా, 2023 సెప్టెంబర్ 22 వ తేదీన తమిళనాడు ఎఫ్ పి ఓల అనుసంధానానికి వీలుగా మదురైలో ఎస్ బి ఐ – ఎఫ్ పి ఓల అనుసంధాన కార్యశాలను ఏపిమాస్ నిర్వహించింది.

తమిళనాడులోని 17 జిల్లాల నుంచి మొత్తం 52,000 మంది సన్న, చిన్నకారు రైతులకు ప్రాతినిధ్యంవహించే 58 ఎఫ్ పి ఓలు ఈ కార్యశాలలో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకున్నాయి. ఐతే 13 జిల్లాల నుంచి, 41,000 మంది రైతులకు ప్రాతినిధ్యం వహించే 37 ఎఫ్ పి ఓలు ఈ కార్యశాలలో పాల్గొన్నాయి. ప్రతి ఎఫ్ పి ఓ నుంచి ఆ ఎఫ్ పి ఓ సి ఇ ఓ, ఒక పాలకవర్గ సభ్యుడు లేదా సభ్యురాలు ఈ కార్యశాలకు హాజరయ్యారు. ముందే తెలియజేసిన నియమ నిబంధనలకు అనుగుణంగా వారంతా అవసరమైన అన్ని పత్రాలతో సర్వసన్నద్ధంగా పాల్గొనడం విశేషం.

ఎస్ బి ఐ నుంచి ముంబై కార్పొరేట్ కార్యాలయంలో ఏ బి యు, జి ఎస్ ఎస్ – జి ఎం శ్రీ వి ఎస్ సంజాల్, చెన్నై జి ఎం శ్రీ గోవింద్ నారాయణ్ గోయల్ , చెన్నై ఏ బి యు, జి ఎస్ ఎస్ డి జి ఎం శ్రీ కర్రి జగదీశ్వర్ , మదురై డి జి ఎం శ్రీ అమిత్ రంజన్, ముంబై కార్పొరేట్ కార్యాలయంలో ఏ బి యు, జి ఎస్ ఎస్ ఏజిఎం శ్రీ సందీప్ , చెన్నై ఏ బి యు, జి ఎస్ ఎస్ డి జి ఎం శ్రీ కర్రి జగదీశ్వర్ , మదురై (బి ఓ) డి జి ఎం శ్రీ అమిత్ రంజన్, ముంబై కార్పొరేట్ కార్యాలయంలో డి జి ఎం శ్రీ సందీప్, చెన్నై ఎల్ హెచ్ ఓలో ఏ జి ఎం శ్రీ ఎడ్వర్డ్ రాజకుమార్ , పలువురు యితర అధికారులు, శిక్షణ యిచ్చే అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.




ఏపిమాస్ తరపునుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి,కన్సల్టెంట్ శ్రీ అలగప్ప మహేష్, అనంతపురం ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ గోపాలరాజు పాల్గొన్నారు.

కార్యశాల ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన ఎస్ బి ఐ అధికారులు వ్యవసాయ రంగానికి, రైతులకు, ముఖ్యంగా ఎఫ్ పి ఓల కోసం ఎస్ బి ఐ అమలుజరుపుతున్న వివిధ పథకాల గురించి వివరించారు.

ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి తన ప్రసంగంలో తొలుత అటు ఎస్ హెచ్ జి రంగంలోను, ప్రస్తుతం యిటు ఎఫ్ పి ఓల రంగంలోను ఏపిమాస్ నిర్వహిస్తున్న విశిష్ట పాత్ర గురించి వివరించారు. ఎఫ్ పి ఓల అవగాహనకోసం వివిధ భాషలలో ఏపిమాస్ తీసుకు వచ్చిన వివిధ ప్రచురణలను ఆయన ప్రస్తావించారు. ఈ రంగంలో ఏ రకమైన సామర్థ్య నిర్మాణ శిక్షణ కావలసి వచ్చినా, నిర్వహణ తీరుపై అవగాహన అవసరమైనా వాటిని అందించడానికి ఏపిమాస్ సర్వ సమర్థంగా, నిత్య సన్నద్ధంగా వుంటుందని ఆయన చెప్పారు.

ప్రారంభ సమావేశం అనంతరం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత,ప్రభుత్వ పథకాలు, సదస్సు నిర్వహణ తీరుపై పాల్గొన్నవారి స్పందన గురించి ప్రత్యేక సమావేశాలు జరిగాయి.

చివరిగా 30 ఎఫ్ పి ఓలకు సూత్రప్రాయపు రుణ మంజూరు పత్రాలను ఎస్ బి ఐ అధికారులు అందించడంతో కార్యశాల ముగిసింది. ■

నీ మాట నిజమైతే అభినందించేవారు కొందరే, నిజం కాకుంటే నిందించేవారు ఎందరో..

# నాబార్డ్‌చే హైదరాబాదులో చిరుధాన్యాల మహోత్సవం!

## 'ది హిందూ' బిజినెస్ లైన్ సహ నిర్వహణ

2023 సెప్టెంబర్ 15 వ తేదీన హైదరాబాదులో నాబార్డ్, 'ది హిందూ ఆంగ్ల పత్రిక' వాణిజ్య ప్రచురణ 'బిజినెస్ లైన్' సంయుక్త నిర్వహణలో 'చిరుధాన్యాల మహోత్సవం' (మిల్లెట్ కాన్‌క్లేవ్) జరిగింది. నాబార్డ్ ఛైర్మన్ శ్రీ షాజీ కె వి ఈ మహోత్సవాన్ని ప్రారంభించారు.



అనంతరం శ్రీ షాజీ కె వి ప్రధాన ప్రసంగం చేస్తూ, మన దేశం ఆహార భద్రతను సాధించి నప్పటికి, యింకా పోషకాహార భద్రతను సాధించవలసి వున్నదని, యిందుకు చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం ఎంతైనా అవసరమని అన్నారు. చిరుధాన్యాల ప్రత్యేకతను గురించి ఆయన వివరిస్తూ, యివి సూర్యరశ్మిని గ్రహించే కిరణజన్య సంయోగ ప్రక్రియలో కర్బన వాయువును తక్కువగా విడుదల చేసే పర్యావరణానుకూల పంటలని, కొద్దిపాటి నీటితోనే సాగు చేయవచ్చునని, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని నిలుస్తాయని పేర్కొన్నారు. ఇంతేకాకుండా ఇతర తృణధాన్యాలతో పోల్చిచూస్తే, పంటకాలం 60 శాతం తక్కువని, అందువల్ల రైతుకు పంటనష్టభయం కూడా తక్కువేనని ఆయన అన్నారు.

నాబార్డ్ నిర్వహించగలిగే పాత్ర గురించి శ్రీ షాజీ కె వి ప్రస్తావిస్తూ, మేము రైతులను పూర్తిగా వ్యవసాయ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, వ్యవసాయ ప్రాసెసింగ్ కార్యకలాపాలకు మళ్ళించడానికి ప్రయత్నిస్తున్నాము. సహకార సంస్థల (కోఆపరేటివ్స్) పునరుజ్జీవానికి కృషిచేస్తున్నాము. సహకార సంస్థలే అసలైన ఎఫ్ పి ఓలు' అని .అన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డు కేవలం ప్రధాన వ్యవసాయ రంగం లోనే కాకుండా, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలను నిర్వహించే రైతులకు కూడా ఉపయోగపడేవిధంగా మార్పు చేర్పులు చేసేలా రిజర్వ్ బ్యాంక్‌తో చర్చిస్తున్నామని కూడా నాబార్డ్ ఛైర్మన్ పేర్కొన్నారు.

బిజినెస్‌లైన్ ఎడిటర్ శ్రీ రఘువీర్ శ్రీనివాసన్ తోను, బిజినెస్ లైన్ ఇతర వివిధ విభాగాల ఎడిటర్లతోను, నాబార్డ్ యితర ఉన్నత అధికారులు సి సి డి సిజిఎం శ్రీ మొనోమయ్ ముఖర్జీ, తెలంగాణా ఆర్ ఓ సిజిఎం శ్రీమతి సుశీల చింతల, ఆంధ్ర ప్రదేశ్ ఆర్ ఓ సి జి ఎం శ్రీ ఎం ఆర్ గోపాల్ తోను నాబార్డ్ ఛైర్మన్ శ్రీ షాజీ కె వి ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు.

ప్రారంభ సమావేశంలో యింకా బిజినెస్‌లైన్ ఎడిటర్ శ్రీ రఘువీర్ శ్రీనివాసన్ స్వాగతోపన్యాసం చేశారు. ఐ సి ఏ ఆర్ సెక్రెటరి (డి ఏ ఆర్ ఇ), డైరెక్టర్ జనరల్ శ్రీ హిమాంశు పాఠక్ పరోక్షంగా వర్చువల్ ప్రసంగం చేయగా, జాతీయ చిరుధాన్యాల పరిశోధక సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి సమావేశ ప్రసంగాల, చర్చల సారాంశాన్ని క్రోడీకరించారు.




చర్చల నిర్వాహకులలో నాబార్డ్ హెచ్ ఓ–ఎఫ్ ఎస్ డి డి – సి జి ఎం శ్రీ బి. ఉదయభాస్కర్, భారత్ బయోటెక్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణా ఎల్లా, ఆరోగ్య మిల్లెట్స్ కంపెనీ సి ఇ ఓ శ్రీమతి సరస్వతి మల్లువలస, సుస్థిర వ్యవసాయ కేంద్రం సి ఇ ఓ ఇ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటి డైరెక్టర్ శ్రీ జి వి రామాంజ నేయులు, ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శోభన్ సజ్జా, అపెడా ఏ జి ఎం ఏ జి ఎం ఆర్ పి నాయుడు వంటి ప్రముఖులు వున్నారు. ■

ప్రగతికి కొలమానం వేగం కాదు, దిశ ; నిదానమైనా అది సవ్యమైన దిశా, కాదా అనేది ప్రధానం

# తెలంగాణా సి జిఎంచే ఆదిలాబాద్ క్లస్టర్ ప్రాజెక్టుల సందర్శన !









*తలమడుగు పాక్స్ లో ... యు ఎన్ ఆర్ ఎఫ్ పి సి లో ట్రాక్టర్ల ప్రారంభోత్సవం ... ఎల్ ఇ డి పి శిక్షణ*

**నాబార్డ్** తెలంగాణా ఆర్ ఓ సి జి ఎం శ్రీమతి సుశీల చింతల 2023 సెప్టెంబర్ 5,6 తేదీలలో నాబార్డ్ ఆదిలాబాద్ క్లస్టర్ కార్యాలయాన్ని, ఆ క్లస్టర్ పరిధిలో నాబార్డ్ తోడ్పాటుతో అమలవుతున్న వివిధ ప్రాజెక్టులను సందర్శించి, ప్రాజెక్టుల అమలు తీరుతెన్నులను పరిశీలించారు.

**తలమడుగు పాక్స్‌లో ...**

తలమడుగు పాక్స్‌ను బహుళ సేవల కేంద్రం (ఎం ఎస్ సి) గా అభివృద్ధిపరచి, సూపర్ బజార్, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి, గోదాము నిర్మాణానికి నాబార్డ్ తెలంగాణా ఆర్ ఓ 100 లక్షల రూపాయలు సమకూర్చింది. ప్రస్తుతం పాక్స్ సూపర్ బజార్‌ను ఏర్పాటు చేసి, విజయవంతంగా నిర్వహిస్తున్నది.



*ఇంద్రవెల్లి పత్తి జిన్నింగ్ మిల్లులో ...*

శ్రీమతి సుశీల చింతల పాక్స్ పనితీరును అభినందిస్తూ, త్వరలో పెట్రోల్ బంక్‌ను, గోదామును ఏర్పాటు చేసుకోవలసిందిగా పాక్స్ ప్రెసిడెంట్‌కు సూచించారు.

**యు ఎన్ ఆర్ – ఎఫ్ పి సి లో ...**

ఉట్నూరు మండలంలో ధన్ ఫౌండేషన్ నేతృత్వంలో పనిచేస్తున్న యు ఎన్ ఆర్ – ఎఫ్ పి సిని శ్రీమతి సుశీల చింతల సందర్శించి, వారు నిర్మించిన గోదామును, సి హెచ్ సి కోసం సమకూర్చుకున్న ట్రాక్టర్లను ప్రారంభించారు.

**ఎల్ ఇ డి పి శిక్షణ కార్యక్రమం**

ఉట్నూరు మండలంలోని 11 గ్రామాలకు చెందిన 28 ఎస్ హెచ్ జి ల కుటుంబాలకు ఉసిరిక కాయల (ఆమ్లా) ప్రాసెసింగ్ పై నాబార్డ్ తోడ్పాటుతో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ (సి పి ఎఫ్ ) నిర్వహిస్తున్న ఎల్ ఇ డి పి శిక్షణ కార్యక్రమాన్ని సి జి ఎం శ్రీమతి సుశీల చింతల సందర్శించి, ఆమ్లా ప్రాసెసింగ్ ను భారీస్థాయిలో చేపట్టవలసిందిగా సూచించారు.

**ఎస్ ఎల్ డి పి కార్యక్రమం**

అసిఫాబాద్ జిల్లాలోని సిరిపూర్–యు, లింగాపూర్

*(మిగతా 15వ పేజీలో)*








*పత్తి నూనె కేంద్రానికి ప్రారంభోత్సవం ... ఎస్ ఎల్ డిపి యూనిట్ల పంపిణీ ... గ్రామీణ సంత (రూరల్ హాట్) కు భూమి పూజ*

**పని భారానికి ఆసక్తే కొలమానం; ఆసక్తి వుంటే కష్టమైనా సులువే, అదే లేకుంటే సులువైనా కష్టమే**

# హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ కన్నుమూత

ఆకలి రక్కసిని అంతమొందించేందుకు నిరంతరం శ్రమించిన 'భారత హరిత విప్లవ పితామహుడు' డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ (98) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో పాటు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్వామినాథన్ సెప్టెంబరు 28 ఉదయం 11.20 గంటలకు చెన్నై తేనాంపేటలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల యావద్దేశం దిగ్భ్రాంతి చెందింది.



స్వామినాథన్ భార్య మీనా గతేడాదే కన్ను మూశారు. స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె సౌమ్య స్వామినాథన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్టుగా, రెండో కుమార్తె మధురా స్వామినాథన్ బెంగుళూరులోని భారత గణాంక శాస్త్ర సాంకేతిక సంస్థలో ఆర్థిక విభా గ ప్రొఫెసర్‌గా, చిన్న కుమార్తె నిత్యా స్వామినాథన్ ఇంగ్లాండ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

**బెంగాల్ కరువు ప్రభావం**

ఎంఎస్ స్వామినాథన్‌గా ప్రపంచానికి చిరపరిచితులైన ఆయన పూర్తి పేరు మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్. ఆయన తమిళనాట ఆలయాల పట్టణంగా పేరుగాంచిన కుంభకోణంలో 1925 ఆగస్టు 7న డాక్టర్ ఎంకే సాంబశివన్, పార్వతి తంగమ్మాళ్ దంపతులకు జన్మించారు. కుంభకోణం లోని కేథలిక్ లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో ప్లస్‌టూ వరకు చదివిన ఆయన.. తిరువనంతపురం మహారాజ కళాశాలలో జంతు శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. స్వామినాథన్ తండ్రి వైద్యుడు. స్వామినాథన్ కూడా తనలాగే వైద్యవృత్తిని స్వీకరించి, తన వైద్యశాల బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన కోరుకునేవారు. అప్పట్లో బెంగాల్‌లో ఏర్పడిన విపరీతమైన కరువు పరిస్థితులు స్వామినాథన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. దాంతో ఆయన దృష్టి వ్యవసాయరంగంపైకి మళ్లింది.

**ఎన్నో పరిశోధనలు..**

స్వామినాథన్ 11ఏళ్ల వయస్సులో ఉండగానే తండ్రి మృతి చెందారు. ఆ తర్వాత పినతండ్రి సంరక్షణలో ఆయన పెరిగారు. 1940–44లో మద్రాస్ వ్యవసాయ కళాశాలలో చేరి వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలో జన్యుపంటల పరిశోధన లకు సంబంధించి ప్రథమశ్రేణి లో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. 1948లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ పోలీసు శాఖలో చేరదలుచుకోలేదు. పలు పరిశోధనా సంస్థల్లో పనిచేశారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పొందారు. స్వామినాథన్ వందల సంఖ్యలో అక్కడ పరిశోధనా పత్రాలు సమర్పించారు. వ్యవసాయ పరిశోధన లపై అనేక గ్రంథాలు రచించారు. అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం లభించినా వదులుకుని 1954లో స్వదేశానికి తిరిగొచ్చారు. ఒడిశా రాష్ట్రం కటక్‌లోని వ్యవసాయ వర్సిటీలో ఆచార్యునిగా చేశారు.

**గోధుమ విప్లవానికి ఆద్యుడు**

1960 దశకంలో దేశంలో కరువు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. అమెరికా నుంచి గోధుమలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి. భారత్‌లో ఇక తగిన ఆహారోత్పత్తి జరగదని, ప్రజలు ఆకలితో అలమటించి చనిపోవడం ఖాయమని అప్పట్లో ప్రపంచ దేశాలన్నీ భావించాయి. ఆ సందర్భంలోనే స్వామినాథన్ జపాన్‌లో కొత్తగా కనుగొన్న గోధుమ వంగడాన్ని దేశంలో ప్రవేశపెట్టి, అధిక ఉత్పత్తిని, 200 శాతం లాభాలను సాధించేందుకు దోహదపడ్డారు. ఈ విప్లవాన్నే 'గోధుమల విప్లవం' అంటూ నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వామినాథన్ సేవలను వేనోళ్ల కొనియాడారు.

పరస్పరం ఎంత గౌరవం వుందనేది కాదు, ఆ గౌరవం ఎంతకాలం వుంటుందనేది ముఖ్యం

చైనా వరి వంగడాలను కూడా దేశంలో ప్రవేశపెట్టి వరిధాన్యాల ఉత్పత్తిని అధికం చేశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధిని సాధించేందుకు ఎంతో కృషి చేశారు. ఆహారధాన్యాలను దిగుమతి చేసుకునే దుస్థితిని తప్పించి వ్యవసాయోత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దిన ఘనత స్వామినాథన్‌కే దక్కుతుంది. ఈ అభివృద్ధి భారతదేశంలో సాంప్రదాయ వ్యవసాయం నుండి హరిత విప్లవానికి దారితీసింది. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడు అని పిలుస్తారు. బంగాళాదుంపల ఉత్పత్తిని పెంచడంలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. స్వామినాథన్ 1980లలో 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించారు.

చిరుధాన్యాలపై పరిశోధనలకు అప్పట్లోనే స్వామినాథన్ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన ముందుచూపునకు నిదర్శనంగా 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. దేశ విదేశాల్లో పేరుగడించిన పరిశోధనా సంస్థల్లో ప్రొఫెసర్‌గా, పరిశోధకుడిగా, విభాగాధిపతిగా ఎన్నో పదవులను స్వామి నాథన్ నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శిగా, కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యుడిగా సేవలందించారు. గ్రామీణ ప్రజల అభివృద్ధి, వ్యవసాయ పరిశోధనలకు గాను కొలంబియా విశ్వవిద్యాలయం ఆయనను 'వాల్వో' బిరుదుతో సత్కరించింది. దేశవిదేశాలకు చెందిన వివిధ విశ్వ విద్యాలయాలు స్వామినాథన్‌కు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఆయనకు మొత్తం 84 గౌరవ డాక్టరేట్లు వచ్చాయి. అంతేకాకుండా పీహెచ్‌డి పరిశోధక విద్యార్థులెందరికో మార్గదర్శిగాను సేవలందించారు. దేశంలోని వివిధ వైజ్ఞానిక సంస్థల సభ్యుడిగాను ఆయన విశిష్ట సేవలందించారు. వ్యవసాయ రంగంలో పునరుజ్జీవనాన్ని తీసుకొచ్చిన ఆహారధాన్యాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దిన ఎంఎస్ స్వామినాథన్ 90 యేళ్ల వయస్సులోనూ తన పరిశోధనలను కొనసాగిస్తూ వచ్చారు.

**అవార్డుల పరంపర...**

వ్యవసాయ రంగానికి అందించిన సేవలకుగాను ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులను, జాతీయ అంతర్జాతీయ పరిశోధనా సంస్థల నుంచి పురస్కారాలను అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన్ని పద్మశ్రీ (1967), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989) పురస్కారాలతో సత్కరించింది. 1965లో ఆయన తొలిసారిగా 'మెండెల్ మెమోరియల్ మెడల్'ను జెకోస్లావిక్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నుంచి అందుకున్నారు. 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్‌సైన్స్ అవార్డు, 1987లో తొట్టతొలిసారిగా వరల్డ్ ఫుడ్ అవార్డు, 1991లో పర్యావరణ సంబంధిత టేలర్ బహుమతి అందుకున్నారు. 33 జాతీయ అవార్డులు, 32 అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు.

**ప్రముఖుల నివాళి**

స్వామినాథన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తదితరులు సంతాపం ప్రకటించారు. ఆకలిబాధలు లేని, ఆహార భద్రత కలిగిన ప్రపంచాన్ని మానవాళికి అందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు దారి చూపే దీపంలాంటి మహత్తర పరిశోధనా వారసత్వాన్ని స్వామినాథన్ వదిలి పోయారని రాష్ట్రపతి నివాళి అర్పించారు. వ్యవసాయ రంగంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పుడు స్వామినాథన్ చేసిన సేవలు లక్షలాదిమంది భారతీయుల జీవితాలనే మార్చివేశాయని ప్రధాని కొనియాడారు.

స్వామినాథన్(98) అంత్యక్రియలు కుటుంబీకులు, రాజకీయనేతలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పరిశోధన కేంద్రం ఉద్యోగుల అశ్రునయనాల నడుమ, ప్రభుత్వ లాంఛనాలతో చెన్నైలోని బీసెంట్‌నగర్ శ్మశానవాటికలో సెప్టెంబరు 30 మధ్యాహ్నం నిర్వహించారు. అంత్యక్రియల్లో కేరళ మంత్రులు కృష్ణన్‌కుట్టి, ప్రసాద్, తెలంగాణ మంత్రి నిరంజన్ రెడ్డి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కె.బాలకృష్ణన్, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

ఆరోగ్యానికి మూలం ఔషధం కాదు; ఆలోచనలో, ఆచరణలో ప్రశాంతత, నవ్వు, ప్రేమ ... ఇవే ఆరోగ్యం

# ఎఫ్ పి ఓ, వ్యవసాయ సిబ్బంది సమన్వయ సమావేశం

– డా. గంగాద్రి గొండిపల్లి, కె.గిరినాథరెడ్డి

ఉయ్యాలవాడలో మేము ఎస్ఎఫ్ఎసి కింద ఎఫ్పిఓ లో పని చేస్తున్నాము. ఈ ఎఫ్పిఓ జూన్ 2021లో నమోదు చేయబడింది. అప్పటికి ఎఫ్పిఓ కార్యకలాపాల పురోగతి చాలా తక్కువగా ఉంది. సాధించవలసిన అన్ని ఫలితాల పురోగతి కూడా అలాగే చాలా తక్కువగా ఉంది. ఆర్‌బీకేలతో కాని, ఎఫ్పిఓలతో అనుసంధానం లేదు. ఈ నేపథ్యంలో మేము జిల్లా వ్యవసాయ అధికారిని సంప్రదించి ఎస్ఎఫ్ఎసి, యం ఐ డి హెచ్ కు ఎఫ్పిఓ పథకం గురించి వివరించాము. ఎఫ్పిఓ సుస్థిరత కోసం క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ




సిబ్బందితో సమన్వయాన్ని ఏర్పాటుచేసుకోవాలని కోరాము. వ్యవసాయశాఖ సహకారంతో ఈ సమన్వయ (కన్వర్జెన్స్) సమావేశం 2023 ఆగస్టు 19 న ఉయ్యాలవాడ, రుద్రవరం మండలాలలో నిర్వహించడం జరిగింది.

ఆర్బీకె – విఎఎ, విహెచ్ఎలు, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, డివిజినల్ వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఇతరులు మొత్తం 106 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు.

**సమావేశం లక్ష్యం:**

1. ఆర్ బి కె ల ద్వారా రైతులకు ఎఫ్పిఓ సేవలను మార్పిడి చేయడానికి మంచి అనుసంధానాన్ని ఏర్పాటు చేయడం
2. ఎఫ్పిఓ సభ్యులకు సులభంగా ఆర్ బి కె సేవల అందుబాటు
3. ఎఫ్పిఓ లకు సభ్యత్వ సమీకరణను సాధించడానికి ఆర్ బి కె లు మద్దతు ఇస్తాయి.

**సెషన్–1:**

నంద్యాల డిఎఓ శ్రీ టి మోహన్‌రావు ప్రారంభ ఉపన్యాసంతో సమావేశం ప్రారంభమైంది. ఎఫ్పిఓ సుస్థిరతలో ఎస్ ఎఫ్ ఎ సి పాత్ర, ఎఫ్పిఓ ప్రాముఖ్యత ఆర్ బి కె పాత్ర ప్రాధాన్యాన్ని శ్రీ మోహన్‌రావు వివరించారు. సభ్య రైతులకు ఎఫ్పిఓ మద్దతు సేవలను ఆయన వివరించారు.

**సెషన్ –2**

- ఎఫ్పిఓ దాని స్వరూప స్వభావాలు, సేవలు, సభ్యత్వ నమోదు, ఆర్ బి కె పాత్రపై ఓరియంటేషన్ జరిగింది.

**ఎఫ్పిఓ సేవలు**

- అన్ని రకాల వ్యాపార లైసెన్స్‌లను కలిగి ఉండటం
- ఎఫ్‌డిసి / రైతు అంగడి దుకాణాన్ని ఏర్పాటు చేయడం
- సాగు / పొలంబడి ప్రదర్శనలు
- కొత్త సాంకేతికతను, అధిక దిగుబడిని అందించే విత్తనాలను పరిచయం చేయడం
- ఆర్ ఎ ఆర్ ఎస్, కె వి కె లు మొదలైన పరిశోధనా సంస్థలతో ఒప్పందం, యంఓయులు చేసుకోవడం
- ఎఫ్ ఐ జిల ద్వారా ప్రభుత్వ పథకాలను అంది పుచ్చుకుని, మూలధన వ్యయాన్ని తగ్గించడం
- హోల్‌సేల్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు
- పంటలకు ప్రాసెసింగ్ విలువ జోడింపు కార్యక్రమాలు
- ఎఫ్ పి ఓ ఆర్థిక అవసరాలను తీర్చడానికి వివిధ ఆర్థిక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం
- డివిడెండ్ షేర్ల పంపిణీ

**ఓడించడం కాదు, మనసులను గెలుచుకో ;హేళనగా నవ్వడం కాదు అందరితో ఆనందంగా నవ్వుకో**



ఎఫ్ పి ఓ కార్యకలాపాలు

- సభ్యులు, బిఓడీలకు శిక్షణలు, సిబ్బందికి శిక్షణలు
- సాధారణ సమావేశాలను నిర్వహించడం
- ఖాతాల పుస్తకాలను నిర్వహించడం
- చట్టపరమైన విధులను పూర్తి చేయడం
- నివేదికల తయారీ, సమర్పణ

**కార్యాచరణ ప్రణాళిక**

కోయిలకుంట్ల ఏడిఏ శ్రీ సుధాకర్ ఆర్ బి కె పరిధిలో అందుబాటులో ఉన్న రైతుల ఆధారంగా ఆర్ బి కె వారీగా సభ్యత్వ నమోదు లక్ష్యాలను పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. మొదటిగా 15 నుండి 20 మంది సభ్యులతో కూడిన ప్రతి ఆర్ బి కె కి ఒక ఎఫ్ఐజి ని తయారుచేసి షేర్ మొత్తం, సభ్యత్వ రుసుము వసూలు 15 పని దినాలలోపు పూర్తి చేయాలని, ఆధార్, ల్యాండ్ పాస్ బుక్ , పాస్ పోర్ట్ సైజు ఫోటో, జిరాక్స్ పత్రాల సేకరణ బాధ్యతను కూడా ఆర్ బి కె సిబ్బంది నిర్వహించాలని సూచించారు.

డిఎఓ ముగింపు వాక్యాలతో ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ముగించారు. పాల్గొన్న వారందరికీ భోజనం ఏర్పాటు చేశారు.

మధ్యాన్నం 2 నుండి సాయంత్రం 5–30 గంటలవరకు రుద్రవరం మండలంలోని కాశీనాయన ఆశ్రమంలో రుద్రవరం, సిరివెళ్ల మండల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ■

## తెలంగాణా సి జిఎం ప్రాజెక్టుల సందర్శన !

(11 వ పేజీ తరువాయి)

మండలాలలో గోండా జాతికి చెందిన 500 మంది లబ్ధిదారులకు నాబార్డ్ తోడ్పాటుతో చేపట్టిన ఎస్ ఎల్ డి పి (సుస్థిర జీవనోపాధుల అభివృద్ధి కార్యక్రమం) కార్యక్రమాన్ని శ్రీమతి సుశీల చింతల సందర్శించి జిరాక్స్ యూనిట్లు, వడ్రంగి యూనిట్లు, పిండి మర, బ్రాస్ బాండ్ వంటి వివిధ జీవనోపాధి ఉపకరణాలను పంపిణీ చేశారు. ఉట్నూరు ఐ టి డి ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీమతి చాద్ బాజ్‌పాయ్, ఐ ఏ ఎస్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**గ్రామీణ సంత (రూరల్ హాట్) కు శంకుస్థాపన**

అసిఫాబాద్ జిల్లా బేలా మండల కేంద్రం బేలా గ్రామంలో డ్రీమ్ సొసైటికి గ్రామీణ సంత నిర్మాణానికి నాబార్డ్ నిధులు మంజూరు చేసింది. సి జి ఎం శ్రీమతి సుశీల చింతల ఆ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గ్రామ ప్రజా ప్రతినిధుల సమక్షంలో సంత నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు.

**పత్తి విత్తనాల నూనె యూనిట్‌కు ప్రారంభోత్సవం**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో ధన్ ఫౌండేషన్ నిర్వహణలోని డి ఎన్ టి – ఎఫ్ పి సి ఏర్పాటుచేసిన పత్తి విత్తనాలనుంచి నూనె తీసే యూనిట్‌కు సి జి ఎం శ్రీమతి సుశీల చింతల ప్రారంభోత్సవం చేశారు. ఎఫ్‌పిసి పాలకవర్గ సభ్యులను, వాటాదార్లను ఉద్దేశించి సిజిఎం ప్రసంగిస్తూ, పత్తి విలువ గొలుసు పెంపులో దేశంలోనే డిఎన్‌టి – ఎఫ్‌పిసి ప్రథమశ్రేణి ఎఫ్ పి సి గా ప్రగతి సాధించే విధంగా కృషి చేయాలని కోరారు. పాలకవర్గం, వాటాదార్ల మధ్య చక్కని అనుబంధాన్ని పెంపొందించినందుకు ఎఫ్ పి సి – సి ఇ ఓను, ప్రోత్సాహక సంస్థ ధన్ ఫౌండేషన్‌ను శ్రీమతి సుశీల చింతల అభినందించారు. తాము ఇంతగా అభివృద్ధి చెందడానికి అన్నివిధాల తోడ్పాటు అందించిన నాబార్డ్‌కు పాలకవర్గ సభ్యులు, ఎఫ్ పి సి – సి ఇ ఓ ధన్యవాదాలు తెలిపారు. ఎఫ్ పి సి మరింతగా అభివృద్ధి చెందడానికి నాబార్డ్ సర్వ విధాల సహకారం అందిస్తుందని, ప్రజల ముఖ్యంగా గిరిజనుల జీవనోపాధుల పెంపుదలకు అండగా నిలుస్తామని శ్రీమతి సుశీల చింతల హామీయిచ్చారు. ■

**ఇతరులను లెక్కచేయని పొగరుబోతుగా మార్చే విజయం కంటె, వినయాన్ని నేర్పే ఓటమి మేలు**

# గోదాము, కార్యాలయ నిర్మాణానికి 'ధరణి' తీర్మానం!

– జి.శ్రీనివాస్

కామారెడ్డి జిల్లాల్లోని సదాశివనగర్ మండలంలోని 'ధరణి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్' (ధరణి ఎఫ్.పి.ఓ) చట్టప్రకారం చేయాల్సిన కార్యక్రమాలలో భాగంగా ఐదవ వార్షిక మహాసభను 2023 సెప్టెంబర్ 22 న కన్నుల పండుగలాగా జరుపుకున్నారు. మహాసభకు పది పంచాయతీలలోని సభ్యులు, గ్రామ రైతు సంఘం పదాధికారులు, పాలకవర్గం సభ్యులు సిబ్బంది, రైతు మిత్రలు అందరు కలిపి దాదాపు 252 మంది పాల్గొన్నారు. ఈ మహా సభను పద్మాజివాడిలోని రైతు వేదిక భవనంలో జరుపుకున్నారు.



వారు ముందుగా తయారు చేసుకున్న ఎజెండా వారీగా ఎంతో చక్కగా కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. గత సంవత్సరం చేసిన, సాధించిన కార్యక్రమాలు, ఆడిట్ నివేదిక, రాబోవు సంవత్సరంలో చేయబోవు కార్యక్రమాలను సభకు తెలిపి ఆమోదం తీసుకున్నారు. స్వయం నియంత్రణ ఉద్యమ కార్యక్రమాలలో భాగంగా సీక్రెట్ ఓటింగ్ పద్ధతి ప్రకారం ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా పాలకవర్గాన్ని, పదాధికారులను ఎన్నుకున్నారు. గత సంవత్సరంలో పని చేసిన పాలకవర్గం, పదాధికారుల సేవలను కొనియాడారు. నూతనంగా ఎంపిక అయిన వారిని అభినందించారు. వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎఫ్.డి.సి ద్వారా, రైతు సేవ కేంద్రం ద్వారా సభ్యులకు అందుతున్న సేవల గురించి, వివిధ వ్యాపార కార్యక్రమాల గురించి, వరి, మక్కల, కొనుగోలు కేంద్రాల గురించి చర్చించారు. ఇతర సంస్థలతో అనుసంధానంలో భాగంగా ఇ ఫ్రెష్ వారితో, కోరమండల్-గ్రోమోర్ వారితో, అక్షయ పాత్ర ఫౌండేషన్ వారితో అనుసంధానమై, నూతన డీలర్ షిప్ తీసుకొని రైతు సంఘాల సభ్యులకు సేవలు అందించ టానికి తీర్మానం చేసుకున్నారు. ధరణి యఫ్.పి.ఓ లో మహిళా సభ్యుల శాతం పెంచాలని, మహిళా నాయకత్వంపై పని చేయాలని, నూతన గ్రామాలలో సభ్యత్వ నమోదు చేయాలనీ తీర్మానించారు. వారు ఏర్పాటు చేసుకున్న విజన్ సాధించటానికి కొన్ని కమిటీలు ఏర్పాటు చేసుకొని అందరిని భాగస్వాములుగా చేసుకొని ముందుకు వెళ్ళాలని అనుకున్నారు. విజన్ సాధించటంలో ఏపిమాస్, యస్.వి.పి సంస్థల సహకారం ఎంతైనా అవసర మని భావిస్తూ వారి సహకారంతో ముందుకు వెళ్ళాలని చర్చించారు. అదేవిధంగా కల సాకారం కోసం కల్వరాల గ్రామంలో గ్రామ పంచాయితి వారు ఇచ్చిన స్థలంలో గోదాము నిర్మాణం, కార్యాలయం, రైతుసేవా కేంద్రం ఏర్పాటు చేయటానికి తీర్మానం చేసుకున్నారు. వాటా ధనం చెల్లించిన ప్రతి సభ్యులకు వడ్డీని లెక్కించి ఇవ్వటానికి మహాసభలో తీర్మానించారు. రాబోవు సంవత్సరంలో వ్యాపారం, లావా దేవీలు జరిపిన సభ్యులకు బోనస్ ఇవ్వాలని తీర్మానించారు. ముఖ్యంగా ఒక పద్ధతి ప్రకారం ఉపవిధులను వారిక్కావల్సిన విధంగా సవరణలు చేస్తూ తీర్మానం చేసుకున్నారు. సమావేశం అనంతరం ఆ సవరణలు , తీర్మానాల నివేదికను జిల్లా సహకార అధికారికి రిటర్నులు సమర్పించారు.

**రైతు సంఘాల ఆడిట్**

ధరణి ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ నిర్వహణ కంటే ముందు స్వయం నియంత్రణ ఉద్యమం కార్యక్రమాలను ఎఫ్.పి.ఓ పరిధిలోని పది గ్రామాలలో వారు ఏర్పాటు చేసుకున్న రైతు సంఘాలను ఆడిట్ చేసుకున్నారు. రైతు

సంఘాలలో ఎన్నికలు నిర్వహించి లీడర్ల మార్పిడి చేశారు. మరియు గ్రామ రైతు సంఘాల ఆడిట్, ఎన్నికలు, గ్రామ రైతు సంఘాల మహాసభలు నిర్వహించారు. ముఖ్యంగా ఎఫ్.పి.ఓ వార్షిక మహాసభ సజావుగా జరపటం కోసం నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసుకొని బోర్డు, కమిటి సభ్యులే పూర్తి బాధ్యత తీసుకొని మహాసభను విజయవంతంగా నిర్వహించటంలో ప్రధాన పాత్ర పోషించారు.

సంఘాల, సంస్థల బలోపేతం కోసం స్వయం నియంత్రణ ఉద్యమంలోని 'సంఘాలు మనవే, సమాఖ్యలు మనవే, పాలనా మాదే, నియంత్రణ మాదే' అనే నినాదం స్ఫూర్తితో ఎంతో చక్కగా నిర్వహించారు.

ఈ మహాసభ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి శ్రీమతి భాగ్యలక్ష్మి హాజరై ఇంత చక్కగా మహాసభని నిర్వహించటం చూసి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం తరపున తమ పరిధిలో ఉన్న పనుల విషయంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తిమ్మోజివాడి సర్పంచ్ పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీ కిశోర్‌కుమార్, శ్రీ శ్రీనివాస్ పాల్గొని మహాసభను బోర్డు సభ్యులే స్వయంగా నిర్వహించుకోవటం చూసి వారిని అభినందించారు. సమాఖ్య ఏదైతే వార్షిక ప్రణాళిక చేసుకోన్నదో ఆ ప్రణాళికను నిరంతరం సమీక్షించుకుంటూ ముందుకు సాగాలని హితవు చెప్పారు. వ్యాపారపరమైన కార్యక్రమాలు చేస్తూ సభ్యులందరికి సేవలు అందించాలని, ఎఫ్‌డిసి, రైతుసేవ కేంద్రంలో సభ్యులందరూ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మాస్ సంస్థ ద్వారా ఇంకా కావాల్సిన మద్దతు అందిస్తామని అందరు భాగస్వామంతో కలిసి ముందుకు సాగాలని కోరారు.

ఏపిమాస్, ధరణి యఫ్.పి.ఓ క్షేత్ర స్థాయి సిబ్బంది కుమారి అమృతరాణి మాట్లాడుతూ వ్యవసాయనికి సంబంధించిన సాంకేతికపరమైన సేవలు అందరు వినియోగించుకొని దిగుబడిని పెంచాలని, సమావేశాలు నిర్వహించి పుస్తక నిర్వహణ సక్రమంగా సాగించాలని, నూతన సభ్యులను ఎఫ్.పి.ఓలో చేర్చుకొని, ఉన్న సభ్యులు వాటాధనం పెంచి, సంస్థ స్వంత నిధులను పెంచి కొత్త వ్యాపారాలు చేపట్టాలని సూచించారు. కామారెడ్డి రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ సిబ్బంది శ్రీ రాజు, వారి టీం సభ్యులు పాల్గొని మహాసభ నిర్వహణ తీరుపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ధరణి ఎఫ్.పి.ఓ మాదిరిగా అన్ని యఫ్.పి.ఓ లలో కూడా వార్షిక మహాసభలు నిర్వహించటానికి ప్రణాళికలు చేసుకొని నిర్వహిస్తే బాగుంటుందని తెలుపుతూ రాబోవు రోజులలో ధరణి కోసం రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా కొంత సహకారం అందిస్తామని తెలిపారు. చివరగా ఎఫ్.పి.ఓ కార్యదర్శి వందన సమర్పణతో మహాసభ ముగిసింది. ■




## ధీశాలి వార్షిక మహాసభ

మహిళా రైతులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి తెలిపారు. బొమ్మల రామారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక మహాసభలో పాల్గొని ఆయన ప్రసంగించారు. ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రూ.10.50 లక్షల వ్యాపారం చేయడం అభినందనీయ మన్నారు. గ్రామీణ మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, యాదగిరిగుట్ట ఏడీఏ పద్మావతి, యాదాద్రి డీసీఓ శ్రీనివాస్, పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, ధీశాలి ఎఫ్‌పీఓ డైరెక్టర్లు సుజాత, చంద్రకళ, ఈశ్వరమ్మ, అండాలు, వరలక్ష్మి, పార్వతి, అరుణ, చంద్రమ్మ, సీఈఓ హరిలాల్ పాల్గొన్నారు. ■

# భారంలేని బోధన ... జీవితపాఠాల అధ్యయనం!

## విద్యార్థుల ఆసక్తికి, ఇష్టాయిష్టాలకు అనువైన చదువులు !!

*వివిధ రాష్ట్రాలనుంచి హాజరైన దాదాపు ఆరువందల మంది విద్యావేత్తలూ ఉపాధ్యాయులతో మూడురోజుల సదస్సు . వారికి వసతీ భోజనాలతో పాటు సమావేశాల నిర్వహణ ఏర్పాట్లన్నీ చేయాలి. 'దాందేముంది చేసేస్తాం...' అన్నారు. అప్పటికప్పుడు పదహారు బృందాలుగా ఏర్పడ్డారు. ఒక్కో దానికీ ఒక్కో లీడరు, ఒక వాకీటాకీ, చకచకా రంగంలోకి దిగారు. వంట, వడ్డన, వసతి... ఆతిథ్యంలో ఎక్కడా ఏ లోపం లేకుండా సమావేశాల్ని విజయవంతం చేశారు. అతిథుల్ని అబ్బురపరిచారు. ఆ నిర్వాహకులంతా పదహారేళ్లలోపు పిల్లలంటే నమ్మగలరా? నమ్మలేకపోతే మీకు 'అక్షరవనం' గురించి తెలియదన్నమాట. అదొక్కటే కాదు, అలాంటి మరెన్నో పాఠశాలలు పిల్లల్ని సమర్థులైన నాయకులుగా తీర్చిదిద్దుతున్నాయి. బోధనకు కొత్త అర్థం చెబుతున్నాయి.*

సైకిల్ తొక్కడం అంటే పిల్లలకు సరదా, అలా సరదాగా పది నిమిషాలు సైకిల్ తొక్కితే అక్కడ మర్నాటి టిఫిన్‌కి ఇడ్లీ పిండి సిద్ధమవుతుంది. అదెలా అంటే... 'చాలా సింపుల్. గ్రైండర్‌లో రుబ్బే రాయికి సైకిల్ని ఎటాచ్ చేశాం, అంతే...' అని నవ్వుతూ చెబుతారు పిల్లలు.

ఇంకాస్త అవతలికి వెళ్తే వడ్ల నుంచి బియ్యం తీసే మెషీన్ కన్పిస్తుంది. దాన్ని ఓ ఎడ్ల జత తిప్పుతుంటుంది. ఆ మెషీన్ తిరిగినంతసేపూ పుట్టే విద్యుచ్ఛక్తిని పిల్లలే తయారుచేసుకున్న ఒక బ్యాటరీలో నిల్వ చేస్తారు. 2ది రాత్రిపూట గదిలో లైటు వెలగడానికి సరిపోతుంది. ఒక్క పని... రెండు ఉపయోగాలు.

మరో బడికి వెళ్లాం... అక్కడో పదమూడేళ్ల అమ్మాయి వంట చేస్తూ కనిపిస్తుంది. ఇంకో పిల్లవాడు ఆవు పాలు తీస్తూంటాడు. రెండు గంటల తర్వాత చూస్తే వాళ్లే లాంగ్వేజ్ ల్యాబ్‌లోని కంప్యూటర్లలో నచ్చిన ఇంగ్లిష్ సినిమా చూస్తూ ఆంగ్ల ఉచ్చారణని ఆకళింపు చేసుకుంటూ ఉంటారు.

ఇంకోచోట... చిన్న చిన్న పాకల్లాంటి తరగతి గదుల్లో బుజ్జి బుజ్జి పాపాయిలు పలక మీద పప్పు గింజలతోనో నేలమీద చాక్పీసుతోనే కూడికలూ తీసివేతలూ చేస్తుంటారు.

మరో ఊరికెళ్దాం... అది బడే కానీ పిల్లల వీపుల మీద పుస్తకాల సంచులుండవు. పరీక్షలు రాస్తారు కానీ మార్కులూ ర్యాంకులూ వారికి తెలియవు. ఫెయిలయ్యావని కోప్పడటాలూ మంచి మార్కులొచ్చాయని బహుమతులూ... ఏవీ ఉండవు. అక్కడ పిల్లలంతా సమానమే. స్వేచ్ఛగా పక్షుల్లా విహరిస్తూ కన్పిస్తారు.

**ఎక్కడ ... అంటారా?**

అక్షరవనం, హరితవనం, వికాస విద్యాపనం, తేజా విద్యాలయం, అభ్యాస... ఈ పేర్లు ఎప్పుడైనా విన్నారా? ఇవన్నీ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న బడుల పేర్లే. పేరుకి తగ్గట్టే ఆ బడులు కూడా ప్రత్యేకంగానే ఉంటాయి. సువిశాల ఆవరణల్లో ప్రకృతిలో మమేకమై పిల్లలు ఆడుతూ పాడుతూనే బతుకు పాఠాల్నీ నేర్చుకుంటూ ఉంటారు. ఈ పాఠశాలల్ని అర్థం చేసుకోవాలంటే ముందు అసలు మన సమాజంలో విద్య పట్ల తల్లిదండ్రులూ ఉపాధ్యాయుల దోరణిని అర్థం చేసుకోవాలి.

**ఒక మంచి స్కూల్ కోసం...**

పాపో, బాబో ముద్దు ముద్దు మాటలు చెప్పడం మొదలెట్టి నప్పటి నుంచి అమ్మానాన్నల మనసులో బడి ఆలోచన మొగ్గ తొడుగుతుంది. బుజ్జాయిని ఒక మంచి స్కూల్లో చేర్పించాలనుకుంటారు. బడికెళ్లే పిల్లలున్న తల్లిదండ్రులు కన్పిస్తే చాలు– స్కూళ్ల గురించి ప్రశ్నల వర్షం కురిపిస్తారు. వారి దృష్టిలో మంచి స్కూల్ అంటే.. పెద్ద భవనమూ విశాలమైన ఆటస్థలమూ ఉండాలి. ఫీజులు అందుబాటులో



ఉండాలి. హోంవర్కులూ పరీక్షలంటూ ఒత్తిడి పెట్టకూడదు కానీ పిల్లలు పోటీ పరీక్షల్లో సత్తా చూపగలిగేలా చదువు బాగా చెప్పాలి...ఇలా ఆశపడి చివరాఖరికి ఇంటికి దగ్గరగా, పంపడానికి సౌకర్యంగా ఉన్న స్కూల్లో చేర్పించేస్తారు. 'ఏం చేస్తాం... మనకి కావాలన్నట్లు ఎక్కడ దొరుకుతాయి... ఇవాళా రేపూ అన్ని స్కూళ్లూ అలాగే ఉన్నాయి... ఫీజుల్లో లేదా తప్ప ఇంకేమీ ఉండదు...” అని తమకు తాము సర్ది చెప్పుకుంటారు. అలా సర్దుకుపోవాల్సిన అవసరం లేదంటున్నాయి, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పలు ప్రత్యామ్నాయ పాఠశాలలు..

పోటీ పరీక్షలూ మార్కులూ ర్యాంకుల ప్రస్తావనే లేని ఫిన్లాండ్ విద్యావిధానం గురించి సామాజిక మాధ్యమాల్లో చూసి.... ఎంత బాగుందో కదూ అనుకుంటాం కదా. దాదాపుగా అదే పద్ధతిలో పని చేస్తున్నాయి ప్రత్యామ్నాయ విధానాల్లో బోధిస్తున్న ఈ పాఠశాలలన్నీ, వాటిని చూసి నేర్చుకోవడానికి ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచే కాదు, విదేశాల నుంచీ కూడా ఉపాధ్యాయులు వస్తున్నారు.

**ప్రత్యామ్నాయమంటే....**

మామూలుగా పాఠశాలలన్నీ అవి ఏ సిలబస్‌ని అనుసరిస్తున్నా... పని చేసే విధానం ఒకటే. యూనిఫారాలు వేసుకుని బరువైన బ్యాగులు మోస్తూ వెళ్లే పిల్లలు వరసగా టైమ్ టేబుల్ ప్రకారం యాంత్రికంగా జరిగే తరగతులూ, బ్లాక్ బోర్డూ పాఠ్య పుస్తకాల సాయంతో పాఠాలు చెప్పే టీచర్లూ పరీక్షలూ మార్కులూ గ్రేడ్లూ... అన్నీ ఒకేలా ఉంటాయి. ఆ మూసలో బలవంతంగా ఇరికించడమే కానీ నిజానికి పిల్లలందరూ ఒకేలా ఉండరు. వారి ప్రతిభా సామర్థ్యాలూ ఒకేలా ఉండవు. అందుకే టీచరు క్లాసులో నలభై మందికి కలిపి పాఠాలు చెప్పినా ఒకరికి ఎనభై మార్కులొస్తే ఇంకొకరికి ఇరవై మార్కులే వస్తాయి.

ఇంకాస్త వివరంగా చెప్పాలంటే .... ప్రభుత్వ పాఠశాలలు ఉపాధ్యాయుడు కేంద్రంగా పని చేస్తాయి. స్కూల్లో జరిగేదంతా ఆయన చుట్టూనే తిరుగుతుంది. షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయడం (పిల్లలకు అర్థమైందా లేదా. అన్నది పట్టించుకునే సమయం అక్కడ ఉండదు). పరీక్షలు పెట్టడం, అందులో వచ్చిన మార్కుల్ని బట్టి పిల్లలకు గ్రేడ్ వేయడం.. అన్నీ టీచర్ మీదే ఆధారపడివుంటాయి. అదే ప్రైవేట్ స్కూల్ విషయానికి వస్తే యాజమాన్యాల దృష్టి ఎంతసేపూ తల్లిదండ్రులను మెప్పించడం పైనే ఉంటుంది. పిల్లలకు మంచి మార్కులొస్తే, ప్రైజులొస్తే, సాంస్కృతిక కార్యక్రమాల్లో వేదిక మీద కన్పిస్తే... తల్లిదండ్రులు సంతోషిస్తారు కాబట్టి వారి దృష్టి అంతా బోధన మీద కాక ఫలితం మీద ఉంటుంది. ఈ రెండు రకాల పాఠశాలల్లోనూ పిల్లల స్థానం రెండోదే అవుతోంది. ఏ పిల్లల కోసమైతే ఈ చదువులూ పాఠశాలలూ వచ్చాయో ఆ పిల్లల ఇష్టాయిష్టాలకూ ఆసక్తులకూ అక్కడ చోటుండడం లేదు.

ఈ పరిస్థితే పలువురిని ప్రత్యామ్నాయ బోధనా విధానాల గురించి ఆలోచించేలా చేసింది. పిల్లలే కేంద్రంగా చదువు. చెప్పడానికి ప్రయత్నించేలా చేసింది. ఫలితంగా వెలసినవే ఈ పాఠశాలలు.

**ఏమిటీ ప్రత్యేకం..?**

ఈ పాఠశాలల్లో పిల్లలదే రాజ్యం, వారి ఇష్టాయిష్టాలదే పైచేయి. ఆటా పాటా చదువూ సంధ్యా... అన్నీ వాళ్లిష్టమే. చదువు జీవితంలో ఒక భాగమే కానీ, చదువే జీవితం కాకూడదన్నది ఈ పాఠశాలల సిద్ధాంతం. అందుకే చదువుతో పాటు జీవన నైపుణ్యాల్నీ నేర్పుతాయి. వీటిల్లో చదివే పిల్లలు సహానుభూతి, స్వీయ క్రమశిక్షణ, సంక్షోభాలను ఎదుర్కొనగల సామర్థ్యం... లాంటివన్నీ నేర్చుకుంటారు. ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారు. ఇంకా....

- ఈ పాఠశాలలు ముందుగా తమ విధానం గురించి తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తాయి. తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ కలిసి సమష్టిగా పిల్లలకోసం పని చేయడాన్ని ఇక్కడ చూస్తాం.
- ప్రతి విద్యార్థి ఇక్కడ ప్రత్యేకమే. ఎవరితోనూ పోటీ ఉండదు. ఒత్తిడి ఉండదు. ఎవరికి వాళ్లే సొంతంగా చదువుకుంటారు కాబట్టి మనసు పెట్టి ఇష్టంగా నేర్చుకుంటారు. పీరియడ్లూ, టైమ్ టేబుల్ గొడవుండదు. ఎవరికి ఎప్పుడు ఏ సబ్జెక్టు చదవాలనిపిస్తే అదే చదువుకోవచ్చు. అంతమాత్రాన ఇష్టం లేని సబ్జెక్టుల్ని వదిలేయరు. వాటిని కూడా ఆసక్తిగా చదివే వాతావరణం కల్పించడమే పర్యవేక్షకుల బాధ్యత.
- సాధారణ పాఠశాలల్లో విద్యార్థులు ఖాళీగా కూర్చుని టీచరు చెబితే వినాలి. 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' పేర్కొనే ఈ విధానంలో చెప్పేవారు ఎవరూ ఉండరు. ఏ పాఠమైనా సరే దానికి సంబంధించి ఏదో ఒక ప్రాక్టికల్ పని ఉంటుంది. అందుకే ఈ పాఠశాలల్లో పిల్లలు తమ పనులు తాము చేసుకుంటూనే వంటా తోటపనీ లాంటివన్నీ కూడా దినచర్యలో భాగం చేసుకుంటారు.
- ఈ విధానం వల్ల పిల్లలకు శ్రమ విలువ తెలుస్తుంది. తిండి బట్ట ఇల్లూ.. ఎలా వస్తాయో, అందుకు ఎంత కష్టపడాలో తెలుస్తుంది. ఎన్నిరకాల వృత్తులున్నాయో, ఎంతమంది కలిస్తే ఒక్కో వస్తువు తయారవుతుందో తెలుసుకుంటారు.
- పాఠ్యాంశానికి సంబందించి పుస్తకంలో ఉన్నదే కాక చర్చల ద్వారా. అనుభవాల ద్వారా మరింత ఎక్కువ. సమాచారాన్ని తెలుసుకుని సమగ్రమైన అవగాహన పెంచుకుంటారు. సృజనాత్మకంగా స్వేచ్ఛగా ఆలోచించడం, అభిప్రాయాలను స్పష్టంగా చెప్పడం అలవడుతుంది.
- ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లల మీద అధికారం చెలాయించారు. పిల్లలకు సహాయకులుగా, స్నేహితులుగా, సందేహాలు తీర్చే పెద్దన్నలా ఉంటారు.

**అవి అపోహలే!**

చాలామంది తల్లిదండ్రులకు ఇలాంటి పాఠశాలల మీద అపోహలుంటాయి. వీటిల్లో చదువుకుంటే పై చదువులకు వచ్చేసరికి ఇబ్బంది పడతారేమోననీ పోటీ పరీక్షల్లో వెనకబడిపోతారని ఉద్యోగావకాశాల్ని అందిపుచ్చుకోలేరనీ భయపడతారు. అవన్నీ అర్థంలేని భయాలేనంటున్నాయి. ఈ పాఠశాలల్లో వస్తున్న ఫలితాలు. నిజానికి ఈ పాఠశాలల్లోనూ స్టేట్ లేదా సెంట్రల్ సిలబస్‌లనే అనుసరిస్తారు. పాఠాలు చెప్పే పద్ధతిలోనే తేడా ఉంటుంది. రకరకాల బోధనా సామగ్రిని వినియోగించి బట్టీ పట్టే అవసరం లేకుండా ప్రతి విషయం పిల్లలకు అర్థమయ్యేలా చూస్తారు.

నిదానంగా చదువుకున్నా మౌలిక విషయాల్ని లోతుగా అర్థం చేసుకోవడంతో పునాది పటిష్టంగా పడుతుంది. కాబట్టే పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. పోటీ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు. మామూలు స్కూళ్లలో చదువుకున్న పిల్లలకన్నా ఈ స్కూళ్లలో చదువుకున్న పిల్లల్లో సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని చూడవచ్చు. అలాగని ఇవి ఖరీదైనవో, అందరికీ అందుబాటులో లేనివో కావు.

దాదాపుగా ప్రతి జిల్లాలోనూ ఉన్న ఈ స్కూళ్లు చాలా వరకూ పేదలకూ మధ్య తరగతి వారికీ అందుబాటు లోనే ఉన్నాయి. కొన్ని పూర్తిగా ఉచితం కూడా. పలుచోట్ల తొలి తరం బడిబాట పట్టిన పిల్లలూ ఉండటమే అందుకు నిదర్శనం. వారికి చదువు మరింత ఆసక్తిగా ఉండేందుకు గాను ప్రాథమిక విద్యను మాతృభాషలోనే చెబుతున్నాయి ఈ పాఠశాలలన్నీ. సృజనాత్మకంగా పిల్లల సమగ్ర వికాసానికి కృషిచేస్తున్న ఈ పాఠశాలలకు ప్రభుత్వ సంస్థ 'సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్' గుర్తింపు లభించడం విశేషం.

**ఒక్కో పాఠశాలది ఒక్కో ప్రత్యేకత!**

**త**మమైన ప్రత్యేకతలతో పిల్లల్నీ పెద్దల్ని ఆకట్టుకుంటున్న ఈ ప్రత్యామ్నాయ పాఠశాలలు తెలుగు రాష్ట్రాల్లో చాలానే ఉన్నాయి. ఇవన్నీ కూడా ఉన్నత విద్యావంతులు తమ కెరీర్లను వదులుకుని వచ్చి మరీ నెలకొల్పినవే. అలాంటి కొన్ని...

**అక్షరవనం:** చేస్తూ నేర్చుకోవడం – అనే విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆచరించి చూపిస్తోన్న ఈ పాఠశాల పిల్లల

ఆజమాయిషీలోనే సాగుతుంది. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి దగ్గర రెసిడెన్షియల్ విధానంలో నడుస్తోంది. వసతి భోజనం చదువూ అన్నీ ఉచితమే. పిల్లల్ని వయసుని బట్టి బృందాలుగా ఏర్పాటుచేసి వాళ్లు చేయాల్సిన పనుల్ని నేర్చుకోవాల్సిన పాఠాల్ని నిర్దేశిస్తారు. పిల్లలు సొంతంగా చదువుకుంటారు. స్నేహితులతో చర్చలు జరుపుతారు. ఇంకా సందేహాలుంటే పెద్దవాళ్లను అడుగుతారు. ఆడా, మగా తేడా లేదు. వంట నుంచీ వ్యవసాయం దాకా అన్ని పనులూ అందరూ చేస్తారు. పాలు పితుకుతారు. వెల్డింగ్ చేస్తారు. ఆటలు ఆడతారు, నృత్యాలు చేస్తారు.

వాళ్లకు రాని పని లేదంటే అతిశయోక్తి కాదు. ఇవన్నీ చేస్తూనే అంచెలంచెలుగా పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతారు. ఇక్కడ చదువుకున్న పిల్లలు విదేశాలకు వెళ్లారు. ఐఐటీలకు ఎంపికయ్యారు. తాము అనుసరిస్తున్న ఈ విధానం వల్ల పిల్లలకు టైమ్ మేనేజ్మెంట్, క్రైసిస్ మేనేజిమెంట్, ఫైనాన్షియల్ మేనేజ్మెంట్... లాంటివన్నీ చేతనవుతున్నాయంటున్నారు. నిర్వాహకులు మాధవరెడ్డి, శ్రీపతిరెడ్డి, ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్ పేరుతో తల్లిదండ్రులకు వర్కుషాపులూ పెడుతున్నారు.

**వికాస విద్యావనం:** విజయవాడలో ఈ పాఠశాలను అమెరికా నుంచి వచ్చిన ఎస్ఆర్ పరిమి ప్రారంభించారు. ఐదో తరగతి వరకూ ఒక స్కూలు, ఆరు నుంచి పదో తరగతి వరకూ నగర శివార్లలో మరో క్యాంపస్ ఉన్నాయి. పదేళ్ల లోపు పిల్లలకు మాంటిస్సోరీ తదితర విధానాల్లో బోధిస్తూ ఆడుతూ పాడుతూనే అన్నీ నేర్చుకునేలా చూస్తారు.

ఇంటి నుంచి వచ్చే పిల్లలే అయినా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాలు స్కూల్లోనే ఇస్తారు. ఒక వంతు సమయం మాత్రమే చదువుకీ మిగిలిన రెండొంతులూ ఆటపాటలూ సాంస్కృతిక కార్యక్రమాలకూ కేటాయిస్తారు. పిల్లలు ఎలాంటి ఒత్తిడీ లేకుండా బాల్యాన్ని ఆస్వాదించేలా ఉంటుంది. ఇక్కడి ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాల మాత్రం పూర్తిగా రెసిడెన్షియల్ అక్కడ బోధన, బోధనేతర సిబ్బందీ, విద్యార్థులూ కలిసి అన్ని పనుల్నీ పంచుకుని చేస్తారు. లెస్



ఇన్స్ట్రక్షన్, మోర్ ఇన్వాల్వ్‌మెంట్ అన్నది ఈ పాఠశాల విధానం. కేవలం నాలుగు గంటలే చదువుకు కేటాయిస్తారు. రోజువారీ పనులతో పాటు ఆటలూ సాంస్కృతిక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు.

**రిషీవ్యాలీ రూరల్ ఎడ్యుకేషన్ సెంటర్:**

చిత్తూరు జిల్లా మదనపల్లె దగ్గర ఉన్న రిషీవ్యాలీ పాఠశాల సేవల్ని తెలుగు మాధ్యమంలోనూ తేవాలని తలచి ప్రారంభించినదే ఆర్ఈసీ. దీనికింద చుట్టుపక్కల గ్రామాల్లో ఏడు పాఠశాలలు నడుస్తున్నాయి. ప్రత్యేకంగా రూపొందించుకున్న విద్యావిధానం వీటి ప్రత్యేకత. మల్టీ గ్రేడ్ మల్టీలెవెల్ అని పేర్కొనే ఈ పద్ధతిలో ఒకే గదిలో మూడు నాలుగు తరగతుల పిల్లలు బృందాలుగా ఉంటారు. బ్లాక్ బోర్డులూ పిల్లలు సొంతంగా నేర్చుకోవడానికి వీలుగా కార్డుల రూపంలో తయారుచేసిన బోధన సామగ్రి పిల్లలకు అందేలా ఉంటాయి. టీచరు పిల్లలకు సహాయకుడిగా మాత్రమే వ్యవహరిస్తారు. పిల్లల ప్రగతిని నిచ్చెనమెట్ల తరహాలో మైలురాళ్లుగా విభజిస్తారు. మంచి ఫలితాలనిస్తున్న ఈ విధానాన్ని ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లోనే కాదు పలు దేశాల్లోనూ అమలు చేస్తున్నారు.

**అభ్యాస విద్యాలయం:**

విజయవాడలో దీప మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పాఠశాలలో ప్రాథమిక విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం ఇంతా అంతా కాదు. ఇక్కడ పిల్లలు

బెల్టూ టై కట్టుకుని తరగతి గదిలో బందీలవరు. పుస్తకాల బరువు మోయరు. తూనీగల్లా తిరుగుతుంటారు. తరగతి గదుల స్థానంలో ఒక్కో సబ్జెక్టుకీ ఒక్కో గది ఉంటుంది.

లెక్కల గదిలో నిత్య జీవితంలో వచ్చే లెక్కలన్నీ అక్కడ ప్రాక్టికల్‌గా నేర్చుకునే సెట్టింగ్ ఉంటుంది. పిల్లలు ఎప్పుడు ఏది నేర్చుకోవాలనిపిస్తే ఆ గదిలోకి వెళ్లి ఒక కొత్త విషయం నేర్చుకుని.. బయటకు వస్తారు. అవి ఎంత ప్రాక్టికల్‌గా ఉంటాయంటే నిజజీవితంలో ఎదురయ్యే అనుభవాలూ బడిలో నేర్చుకునే పాఠాలూ ఒకదానికొకటి కొనసాగింపుగా ఉంటాయి. దాంతో ప్రతి కాన్సెప్టూ పిల్లలకు పూర్తిగా అర్థమవుతుంది. ఈ తరహా పునాది వల్ల పై తరగతులకు వెళ్లినా పిల్లలు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదువుకోగలుగుతున్నారు.

**హరితావరణ విద్యాపీఠం:**

ఉద్యోగాలు వదులుకుని వచ్చిన ఐఐటీ ప్రొఫెసరు సుదాకర్, బ్యాంకు ఉద్యోగిని అయిన ఆయన భార్య ఉషారాణి, పిల్లల చదువులపై పీహెచ్‌డీ చేసిన స్వామి సత్యతీర్థ...ముగ్గురూ కలిసి భద్రాద్రి జిల్లా పాల్వంచ శివారులో చుట్టూ పచ్చని చెట్ల మధ్య హరిత స్కూల్ని నెలకొల్పారు.

గాంధీజీ సిద్ధాంతాల స్ఫూర్తితో, నయీ తాలిమ్ విధానాలతో ప్రభావితులైన వీరు సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూ వాటి ద్వారానే చదువు నేర్చుకోవాలని నమ్ముతారు. అందుకే వెదురుతో తరగతి గదుల నిర్మాణం నుంచి తోటపనులూ రకరకాల యంత్ర సామగ్రి తయారీ వరకూ అన్నింట్లోనూ పిల్లల భాగస్వామ్యం ఉంటుంది. నిత్యజీవితంలో అవసరమైన ప్రతిదీ పిల్లలు స్వయంగా, పర్యావరణహితంగా ఉండేలా చేసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**తేజా విద్యాలయం:**

సూర్యాపేట జిల్లా కోదాడ దగ్గర కొమరబండ గ్రామంలో ఉన్న ఈ పాఠశాల విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న ఆసక్తిని ప్రేరేపిస్తుంది. విశాలమైన ఆవరణలో అన్నిరకాల ఆటలకూ తోటపనికీ అవకాశం కల్పిస్తూ, పిల్లల భౌతిక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతూ విద్యాలయాన్ని ఒక ప్రయోగ క్షేత్రంగా నిర్వహిస్తున్నారు.

పని చేస్తూ, ఆలోచిస్తూ, ప్రశ్నిస్తూ సొంతంగా నేర్చుకోవడం వచ్చిన పిల్లలు జీవితంలో ఏదైనా సాధించగలరంటారు. ఈ స్కూలు నెలకొల్పిన సోమిరెడ్డి. పిల్లల్లో పఠనాసక్తి పెంపొందించడమే కాక వారిలోని ప్రత్యేక నైపుణ్యాలను వెలికి తీసి వాటిల్లో రాణించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఏటా రెండు మూడుసార్లు విహారయాత్రలకు తీసుకెళ్తారు.

ఇవే కాక అనంతపురం జిల్లాలో చెన్నేకొత్తపల్లి దగ్గర ఉచిత సేవలందిస్తున్న టింబు సంస్థవారి 'ప్రకృతి బడి', పేద విద్యార్థులకోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కాకినాడలోని ప్రజా విద్యాలయం', వనపర్తి దగ్గర గోపాల్పేటలోని 'తొలకరి చినుకులు', అనంతపురంలోని 'రాదాస్ స్కూల్ ఆఫ్ లెర్నింగ్, కామారెడ్డిలోని హమారీ మిట్టీ విద్యాలయ'... ఇలా మరెన్నో పాఠశాలలు ఉన్నాయి. ■

## భూమాత వార్షిక మహాసభ

**బ**రోజు రావులచెరువు గ్రామంలో "భూమాత మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్" 5వ వార్షిక మహాసభ అధ్యక్షురాలు రేవతి గారి అధ్యక్షతన ఘనంగా జరిగింది. నూతన పాలకవర్గ సభ్యులు, వాటాదారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ముఖ్య అతిథులుగా ప్రధాన కార్యాలయం నుండి ఎఫ్‌పిఓ కో–ఆర్డినేటర్ శంకర్‌నాయక్‌గారు, వీరభద్రారెడ్డిగారు, ఏపీమాస్ కోఆర్డినేటర్ గంగాధర్ గారు, ఏఎల్‌పి కో–ఆర్డినేటర్ రిజ్వానా గారు, నాబార్డ్ డిడిఎం అనురాధ గారు, ఎంటిఎల్ దస్తగిరి గారు, మేనేజర్ ప్రతాప్ గారు, ఎస్‌టిఓలు, సీఈఓలు మండల సిబ్బంది పాల్గొన్నారు. ■

# రైతు వికాస సమాఖ్య ద్వితీయ వార్షిక మహాసభ

– జి.శ్రీనివాస్



**జ**నగాం జిల్లాల్లోని 13 రైతు ఉత్పత్తిదారుల కంపెనీలను కలిపి మారి సంస్థ, ఏపిమాస్ సహకారం, జర్మనీకి చెందిన డి.జి.ఆర్.వి – జస్టి సంస్థ ఆర్థిక సహకారంతో జిల్లా స్థాయిలో 'రైతు వికాస్ సమాఖ్య' ను ఏర్పాటు చేయటం జరిగింది. చట్టప్రకారం చేయాల్సిన కార్యక్రమాలలో భాగంగా రైతు వికాస్ సమాఖ్య ద్వితీయ వార్షిక మహాసభను 2023 సెప్టెంబర్ 21న జరుపుకున్నారు. మహాసభకు 13 రైతు ఉత్పత్తిదారుల కంపెనీలలోని సభ్యులు, సమాఖ్య పాలకవర్గం సభ్యులు, పదాధికారులు శ్రీ బాబురావ్ నాయక్, శ్రీమతి శ్రీలత, శ్రీ నామండ్ల శ్రీనివాస్, రైతు సమాఖ్య సి.ఇ.ఓ శ్రీ దామెర రమేష్ మరియు ఏపిమాస్ నుండి శ్రీ శ్రీనివాస్ గారు, మారి సంస్థ శ్రీ వెంకట్ గారు, శ్రీ నర్సింగం గారు, శ్రీ యాదగిరి గారు, రైతు సంస్థల సిబ్బంది, అందరు కలిపి దాదాపు 65 మంది పాల్గొన్నారు. ఈ మహాసభను జనగాం లోని సమాఖ్య కార్యాలయంలో జరుపుకున్నారు. వారు ముందుగా తయారు చేసుకున్న ఎజెండా వారీగా చర్చించుకున్నారు. ఇందులో ముఖ్యంగా గత సంవత్సరం చేసిన, సాధించిన కార్యక్రమాలు, ఆడిట్ నివేదిక , రాబోవు సంవత్సరంలో చేయబోవు కార్యక్రమాలను సభకు తెలిపి ఆమోదం తీసుకున్నారు.

ఎఫ్.డి.సి, రైతు సేవ కేంద్రం ద్వారా సభ్యులకు అందుతున్న సేవల గురించి, వివిధ వ్యాపార కార్యక్రమాల గురించి చర్చించారు. ఇతర సంస్థలతో అనుసంధానంలో భాగంగా కోరమండల్–మన గ్రోమోర్ వారితో, అనుసంధానమై , నూతన డీలర్ షిప్ తీసుకొని రైతు సంఘాల సభ్యులకు సేవలు అందించటానికి తీర్మానం చేసుకున్నారు. సమాఖ్యలోని రైతు సంస్థలలో మహిళా సభ్యుల శాతం పెంచాలని, మహిళా నాయకత్వంపై పనిచేయాలని తీర్మానించారు.

ఈ మహాసభ కార్యక్రమానికి ఏపిమాస్ ప్రధాన కార్యాలయం నుండి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ శ్రీనివాస్ , మారి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ వెంకట్, మిగతా సిబ్బంది పాల్గొని, సమాఖ్య సభ్యులను అభినందించారు. సమాఖ్య ఏదైతే వార్షిక ప్రణాళిక చేసుకొన్నదో ఆ ప్రణాళికను నిరంతరం పరిశీలించుకుంటూ, ముందుకు సాగాలని తెలిపారు. వ్యాపారపరమైన కార్యక్రమాలు చేస్తూ సభ్యులందరికి సేవలు అందించాలనని, ఎఫ్.డి.సి, రైతుసేవ కేంద్రంలో సభ్యులందరూ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

మాస్, మారి సంస్థల ద్వారా ఇంకా కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని, అందరు భాగస్వామంతో కలిసి ముందుకు సాగాలని హితవు పలికారు. సమాఖ్య కార్యదర్శి వందన సమర్పణతో సమావేశం ముగిసింది. ■

## లీటరు పాలు రూ.18 లక్షలు.!

**అం**దరూ వివిధ రకాల పాల గురించి వినేఉంటారు. ఆవు, మేక, సోయ పాలు మొదలైనవి. అయితే అత్యంత ఖరీదైన పాలేంటో తెలుసా? అవి గాడిద పాలు అని అనుకుంటే పొరపడినట్లే.. ఎందుకంటే అత్యంత ఖరీదైన పాలు ఎలుక పాలు.. షాకయ్యారా? కానీ ఇది నిజం. ఎందుకంత ఖరీదంటే.. ఎలుక పాలు పొందడం అంత సులభంకాదు. 30 నిముషాల ప్రక్రియలో ఎలుక నుంచి కొద్ది మొత్తంలో మాత్రమే పాలు ఉత్పత్తి చేయబడతాయి. ఒక లీటరు పాలు కావాలంటే 40 వేల ఎలుకలు కావాలి. ఈ ఎలుకల ఒక లీటరు పాలు విలువ రూ. 18 లక్షలు. ఈ పాలును పరిశోధనా సాధనంగా ఉపయోగిస్తారు. ■

నిజమైన సంతృప్తిని కలిగించగలిగేది విజయం కాదు, ఆ విజయంకోసం సాగించిన కృషి

# ఎ టి ఎం ప్రకృతి వ్యవసాయ విధానంలో లాభాల వెల్లువ !

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం నిజంగానే 'రైతును రాజు' గా మార్చుతుందంటున్నారు ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్, ఎక్స్అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి. విజయకుమార్. ప్రపంచవ్యాప్తంగా రసాయనాల్లేకుండా జరుగుతున్న సాగు 1% కాగా, ఏపీలో 14% కావటం విశేషం. ఏటీఎం మోడల్లో 20 సెంట్లలో అనేక రకాల కూరగాయలు, పండ్లు సాగు చేస్తూ ప్రతి నెలా కనీసం రూ. 10-25 వేలు ఆదాయం పొందే మార్గం ఉందని, చిన్న, సన్నకారు రైతులకే కాక, భూమిలేని వ్యవసాయ కార్మికులకూ ఇది వరం లాంటిదని ఆయన అంటున్నారు.. 'సాక్షి సాగుబడి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్న వివిధ ప్రత్యేక అంశాల వివరాలు సాక్షి సౌజన్యంతో ' మహిళా సాధికారత ' పాఠకులకోసం ...*

**ఆంధ్రప్రదేశ్లో తామర తంపరగా విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం విశేషాలు..?**



**విజయకుమార్:** ఏపీలో ప్రకృతి వ్యవసాయం ప్రభుత్వ సహకారం, మహిళా సంఘాల తోడ్పాటుతో విస్తృతంగా అమలవుతోంది. 2023 మార్చి నాటికి 3,800 గ్రామ పంచాయతీలు, 3 వేల రైతు భరోసా కేంద్రాల్లో విస్తరించింది. 8.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొంటున్నారు. అంటే, ఎన్రోల్ అయ్యారు. వీరిలో 2,70,000 మంది రైతులు పూర్తిగా రసాయనాలు వాడటం మానుకున్నారు.

రైతుల ఎన్రోల్మెంట్ దృష్ట్యా మన దేశంలోనే ఇది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో పాల్గొనటం మరే దేశంలోనూ జరగటం లేదు. ప్రకృతి వ్యవసాయ వ్యాప్తి క్రమంగా జరిగే పని. ఒక రైతుకు రెండెకరాలు ఉంటే.. ముందు అరెకరంలో ప్రయత్నిస్తారు. ఏ రైతూ రిస్క్ తీసుకోరు. అరెకరాలో సక్సెస్ సాధిస్తే.. తర్వాత సంవత్సరం విస్తీర్ణం పెంచుతారు.

ఎంత ఖర్చయ్యింది, ఎంత దిగుబడి వచ్చింది, నికర ఆదాయం ఎంత వచ్చింది, భూమిలో మార్పేమి వచ్చింది.. ఇవన్నీ చూసుకొని విస్తీర్ణాన్ని పెంచు కుంటారు. సగటున మా అనుభవంలో రైతులు ప్రకృతి వ్యవసాయంలో అన్ని విషయాలు అనుభవపూర్వకంగా అలవాటు చేసుకోవడానికి 4 ఏళ్లు పడుతుంది. అందుకని ఆ నాలుగేళ్లు ప్రభుత్వం తరఫున మేం వారికి మద్దతుగా నిలుస్తున్నాం. ఈ విధంగా 2,70,000 మంది రైతులు దాదాపు 1,40,000 హెక్టార్లలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్కు ఈ ఏడాది 3 జైవిక్ ఇండియా పురస్కారాలు వచ్చాయి. వీటితో పాటు.. వ్యక్తిగతంగా మీకు "డా. ఎమ్మెస్ స్వామినాథన్ ప్రకృతి పరిరక్షణ పురస్కారం' లభించిన శుభ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు... జైవిక్ ఇండియా పురస్కారాల ప్రాధాన్యం ఏమిటి?**

అంతర్జాతీయంగా ఆర్గానిక్ ఫార్మింగ్ను ప్రోత్సహించే సంస్థ 'ఐఫోమ్' ఈ జైవిక్ ఇండియా పురస్కారాలు ఇస్తుంటుంది. ఐఫోమ్కు ఐక్యరాజ్యసమితికి చెందిన ఎఫ్.ఎ.ఓ., తదితర సంస్థలతో సన్నిహిత సంబంధాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం అవార్డులు ఇస్తుంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ఇస్తున్న

ప్రోత్సాహం, సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ఏపీ ప్రభుత్వానికి 2003లో ఉత్తమ రాష్ట్ర పురస్కారం ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతుకు, ఎఫ్‌పీఓకు కూడా ఇచ్చారు.

**ప్రభుత్వప్రోత్సాహం ఎలా ఉంది..?**

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించటంలో ఏపీ ప్రభుత్వానికి చాలా ప్రత్యేకతలున్నాయి. రైతు భరోసా కేంద్రాలన్నిటి పరిధిలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింప జేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇప్పుడు 28% రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని జిల్లాల్లో, అన్ని మండలాల్లోనూ ఈ కార్యక్రమం అమల్లో ఉంది. ముమ్ముందు గ్రామాలన్నిటికీ విస్తరించాలన్నది లక్ష్యం. ఏపీలో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖనే సీఎం ఏర్పాటు చేయటం విశేషం. దీంతో మంచి ఊపు వచ్చింది. ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఏమిటి..?**

రీజనరేటివ్ అగ్రికల్చర్ అనండి, ఆర్గానిక్ అగ్రికల్చర్ అనండి.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 4 దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నా ఇప్పటికీ చేస్తున్నది 1% మంది రైతులు మాత్రమే. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 14% మంది రైతులు ఎంతో కొంత విస్తీర్ణంలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. తమకున్న పొలం మొత్తంలో పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు 5% ఉన్నారు. అందుకే ప్రపంచంలో ఏపీ అనుభవం ఎంతో విశిష్టమైనది. రైతులతో రసాయనాలు వాడే అలవాటు మాన్పించడం చాలా కష్టం. బలంగా ఉన్న మహిళా సంఘాల వ్యవస్థ ఇందులో పాల్గొనటం వల్ల రైతులకు క్షేత్రస్థాయిలో నైతిక మద్దతు ఇవ్వటం సాధ్యమైంది. ఈ సామాజిక తోడ్పాటు ఎంతో ఉపయోగపడుతోంది. సేద్యంలోనే కాదు, వైవిధ్యపూరితమైన ప్రకృతి పంటల దిగుబడులు కుటుంబాల ఆరోగ్యానికి చాలా అవసరమని మహిళలు గుర్తించటం కూడా ఇది వ్యాప్తి చెందడానికి ఉపయోగకరంగా ఉంది.

**ఏయే పంటల్లో అధిక దిగుబడి..?**

మా అనుభవంలో అన్ని పంటల్లోనూ ఫలితాలు బాగా వస్తున్నాయి. ఖర్చు తగ్గించడం, దిగుబడి పెంచటం, ఎక్కువ వర్షాలు పడినా/ వర్షాభావ పరిస్థితులొచ్చినా పంట తట్టుకునే శక్తి, చీడపీడలను తట్టుకునే శక్తి.. చాలా పంటల్లో అనుకున్న దానికన్నా దిగుబడులు రాబట్టిన సంఘటనలు చాలా ఉన్నాయి.

గిరిజన ప్రాంతాల్లో రాగి పంట దిగుబడి ఎకరానికి వచ్చే దిగుబడి 400–600 కిలోల నుంచి 1200–1800 కేజీలకు పెరిగింది. ఖర్చు సగానికి సగం తగ్గింది. వరిలోనూ అంతర పంటలపై ప్రయోగాలు చేస్తున్నాం. గట్ల వెడల్పును పెంచి కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేయమని.. పంటల వైవిధ్యం పెంచడానికి.. రైతులకు సలహా ఇచ్చాం.

**పవన్ సుఖదేవ్ అధ్యయనం గురించి..?**

పవన్ సుఖదేవ్ అంతర్జాతీయంగా పేరున్న పర్యావరణ వేత్త. పర్యావరణంలో నోబెల్ వంటి టేలర్ అవార్డు గ్రహీత. వీరి జిస్ట్ సంస్థ స్వతంత్రంగా జరిపిన అధ్యయనంలో 11% అధిక దిగుబడి, 54% అధిక నికరాదాయం, పంటల వైవిధ్యం రెండింతలు పెరిగిందని వెల్లడైంది.

**మార్కెటింగ్‌లోకి అమూల్ ప్రవేశిస్తోందట..?**

అవును. ఏపీలో 80% విస్తీర్ణంలో పత్తి సహా 8 రకాల ఆహార పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. ఇప్పటికే టీటీడీ 12 రకాల ఆహారోత్పత్తుల్ని కొనుగోలు చేస్తోంది. బియ్యం, పప్పులు, వేరుశనగలు తదితరాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి అమూల్‌తో ఒప్పందం చేసుకోబోతున్నాం. మండల స్థాయిలో ప్రాసెసింగ్ సదుపాయాలు కూడా వస్తాయి. ఇది మార్కెటింగ్‌లో పెద్ద ముందడుగు అవుతుంది.

**ఏటీఎం మోడల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు ఎలా..?**

అవునండి.. నిజం. ప్రకృతి వ్యవసాయ విధానాలను సక్రమంగా అమలు చేస్తే రైతే రాజని రుజువు చేయొచ్చు. అది నిజంగా జరుగుతుంది. రైతులకు సంవత్సరానికి ఆదాయం ఒక్కసారే ఎందుకు రావాలి? ప్రతిరోజూ రావాలి.. ప్రతి వారం రావాలి... అందుకు ఏటీఎం మోడల్ ఉపయోగ

# సుస్థిర వ్యవసాయంతోనే ఆహార భద్రత

**రా**నున్న సంవత్సరాల్లో భారత్ లో ఆహార సంక్షోభం తలెత్తమందా? దేశవ్యాప్తంగా సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధ్యం కావడం లేదా! కొన్ని. రాష్ట్రాలు మాత్రమే ఈ సుస్థిర వ్యవసాయంలో ముందుకు వెళ్తున్నాయా? అలా వెళ్తున్న రాష్ట్రాలు ఆహార భద్రతకు భరోసా కల్పిస్తున్నాయా! సుస్థిర వ్యవసాయానికి మొత్తం 51 సూచికలను ప్రామాణికంగా తీసుకుని దేశవ్యాప్తంగా జరిపిన అధ్యయనం తర్వాత సుస్థిర వ్యవసాయం సాధించలేని పక్షంలో ఆహార భద్రత కష్టమేనని అఖిల భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్ ఐకార్) అభిప్రాయపడుతోంది.



'కాంపోజిట్ ఇండెక్స్ ఆఫ్ అగ్రికల్చర్ సస్టెయినబిలిటీ' పేరిట దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని వ్యవసాయ విధానాలను ఐకార్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రేమ్‌చంద్, కిరణ్‌కుమార్‌లు పరిశీలించి నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో ఐకార్ ఈ అభిప్రాయానికి వచ్చింది. వ్యవసాయ విధానాల్లో స్పష్టమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తోంది.

**వ్యవసాయ సుస్థిరతకు సవాళ్లు**

వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, తీవ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, భూసారం తగ్గిపోవడం వ్యవసాయ సుస్థిరతకు పెను సవాలుగా మారుతోంది. 2030 నాటికి భారతదేశ జనాభా 150 కోట్లకు చేరుకుంటుంది. ఆ జనాభాకు ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయం రంగంపై ఉంది. కొన్ని రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో మంచి ప్రతిభ కనపరుస్తున్నట్లు కనిపించినా.. వ్యవసాయ రంగానికి సంబంధించిన మొత్తం సుస్థిరత సూచిలకు వచ్చేసారికి వెనుకబడు తున్నాయి.. అని ఐసీఏఆర్ వెల్లడించింది. పంజాబ్, హరియాణ సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ వ్యవసాయ సుస్థిరత సూచిని పరిశీలించినప్పుడు వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. భారత వ్యవసాయ రంగం సుస్థిరత కోణంలో ఉన్నత స్థానంలో లేదని ఓ మోస్తరు సుస్థిరతలోనే ఉన్నట్లు స్పష్టం చేసింది.

**ముందంజలో ఏపీ**

"ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, మిజోరం, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాలు మాత్రమే సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్నా పరిస్థితులు ఎదుర్కొనే రాజస్థాన్ సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనే రాజస్థాన్ సుస్థిర వ్యవసాయంలో చివరలో ఉంది. సుస్థిర వ్యవసాయానికి ప్రధాన సూచికలైన అతి తక్కువ నీరు, రసాయనాలు, ఎరువులు, విద్యుత్ వినియోగిస్తూ భూసారం తగ్గకుండా పంటలు పండించే రైతాంగానికి ప్రభుత్వాలు సరైన సమయంలో జోక్యం చేసుకుని సాయం అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే భారత్‌లో ఆహారభద్రతకు ఇబ్బందులు ఏర్పడకుండా ఉంటాయి" అని ఐకార్ నివేదిక తెలిపింది.

■

---

పడుతుంది. అనంతపురం జిల్లాలో ఈ నమూనా తొలుత ప్రయత్నించి సత్ఫలితాలు సాధించాం. ఇప్పుడు రాష్ట్రంలో అన్ని జిల్లాలకూ విస్తరింపజేస్తున్నాం. 85%గా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు, భూమి లేని వ్యవసాయ కార్మికులకు పెరటి తోటలు/ ఇంటి పంటలుగా సాగుకు కూడా ఏటీఎం మోడల్ ఒక వరం లాంటిది. 20 సెంట్లను కౌలుకు తీసుకొని సాగు చేస్తే.. ప్రతినెలా ప్రతి రైతూ రూ.10,000 నుంచి 25,000 సంపాదించే అవకాశం ఉందని మా అంచనా.

– సాక్షి సౌజన్యంతో..

■

ఆనందం ధనంలో లేదు, కష్టసాధ్యమైనదానిని సాధించడంలో, ఆ ఉద్వేగంలో ఆనందం దాగివుంది

# సీబీఎస్ఈ 'ఒకే ఆడ సంతానం' మెరిట్ స్కాలర్‌షిప్ !

మీరు అమ్మాయిలా? తల్లిదండ్రులకు మీరొక్కరే సంతానమా? అయితే, సీబీఎస్ఈ ప్రకటించిన ఈ మెరిట్ స్కాలర్‌షిప్ (సీబీఎస్ఈ స్కాలర్‌షిప్) మీ కోసమే. తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉండి ప్రతిభావంతులైన ఆడపిల్లల్ని ప్రోత్సహించేందుకు సీబీఎస్ఈ స్కాలర్‌షిప్ అందజేస్తోంది. ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి సంబంధించి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతోంది. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అక్టోబర్ 18వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

- తల్లిదండ్రులకు ఏకైక సంతానంగా ఉన్న ఆడపిల్లలను విద్యలో ప్రోత్సహించడమే లక్ష్యంగా 2006 నుంచి ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌ను అమలు చేస్తున్నారు.
- ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులకు నెలకు 3500ల చొప్పున రెండేళ్ల పాటు అందజేస్తారు.
- దరఖాస్తు చేసుకొనే విద్యార్థినులు సీబీఎస్ఈలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలాగే, ప్రస్తుతం సీబీఎస్ఈ అనుబంధం పాఠశాల్లో 11, 12వ తరగతులు అభ్యసిస్తుండాలి.
- పదో తరగతి పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులు (ఐదు సబ్జెక్టుల్లో) సాధించిన వారు ఈ స్కాలర్‌షిప్ అవార్డుకు అర్హులు. విద్యార్థిని ట్యూషన్ ఫీజు నెలకు రూ.1500 కన్నా మించి ఉండరాదు.
- సెప్టెంబర్ 19న మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుంది. దరఖాస్తులను ఆయా పాఠశాలలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 25 మధ్య వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది.
- ఈ స్కాలర్‌షిప్‌నకు ఇప్పటికే ఎంపికైన విద్యార్థినులు 11వ తరగతి తర్వాత మళ్లీ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. 11వ తరగతి నుంచి 12వ తరగతికి రెన్యువల్ చేయించుకోవాలంటే సదరు విద్యార్థినులు కనీసం 50శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలి.



- భారతదేశ పౌరులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్కు అర్హులు. ఎన్నారైలు కూడా దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు ఉంది. కాకపోతే వారి ట్యూషన్ ఫీజు నెలకు గరిష్టంగా రూ.6000 ఉండాలని నిబంధన విధించారు. ■

## ఏపిమాస్‌ఆధ్వర్యంలో రైతులకు పండ్ల మొక్కల పంపిణీ

రాగానిపల్లి, తోలేటివారిపల్లి, కొత్తబత్తలపల్లి, పాత బత్తలపల్లి, బాపనకుంట, నేరాలవంకతాండ, యర్రవంకపల్లి గ్రామాల ఉత్పత్తిదారుల సంఘంలో ఉన్న రైతులకు, అలాగే అడ్వాన్స్ కట్టిన రైతులకు 50% సబ్సిడీతో మామిడి రకాలైన కేసరి, మల్లిక, హిమాయత్, కొత్తపల్లికొబ్బరి మరియు టెంకాయ చెట్లును ఏపీమాస్ సంస్థ ఆధ్వర్యంలో క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్ట్ సహకారముతో ఆ గ్రామాల రైతులకు పండ్ల మొక్కల సాగును ప్రోత్సహించుటకు రైతులకు మొత్తం 3300 పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీమాస్ సంస్థ అగ్రికల్చర్ ఆఫీసర్ చెరువు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ సి. గోపాల్‌రాజ్, సీఈవో ఎన్. నరసింహప్ప, అకౌంటెంట్ ఆర్. శ్రీనివాసులు, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు. ■

విజయానికి నాలుగు మెట్లు:చక్కని ప్రణాళిక, సమగ్ర సంసిద్ధత,ఆశతో ముందడుగు, పట్టుదలతో కృషి

# ఎఫ్ పి ఓల సుస్థిరతకు రోలింగ్ ప్రణాళిక ఆవశ్యకత !

– ఎస్.ప్రహల్లాద , ఎన్.వినాయకరెడ్డి

**స**న్నకారు మరియు చిన్న రైతులతో స్వయం పోషక మరియు స్వయం సమృద్ధి రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పరచి వాటిని సుస్థిరపరచి తద్వారా సభ్య రైతులకు కావలసిన వివిధ రకాల ఉత్పాదకాలను సముచిత ధరలకు అందించుచూ మరియు వారు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించుట ద్వారా సభ్య రైతులకు గిట్టుబాటు ధరలను అందించాలన్న లక్ష్యంతో మహిళా అభివృద్ధి సొసైటి ఆంధ్రప్రదేశ్, బీహార్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో 84 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటుచేసి విజయవంతంగా ముందడుగు వేస్తున్నది.

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ మనుగడకు కొన్నిరకాల పద్దతులను రూపొందించి వాటిని అమలుపరుచుచున్నది. ఆ పద్ధతులలో కొన్నింటిని క్రింద తెలుపవచ్చును.

**పుస్తకాలు మరియు లెక్కల నిర్వహణ :**

ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థకు నిర్ణీత పుస్తకాలను ప్రవేశ పెట్టి సిబ్బందిని నియమించి వాటిని ఎప్పటికపుడు వ్రాసే విధంగా పర్యవేక్షణ చేయుచున్నది.

**సిబ్బంది నియామకము :** రైతు ఉత్పత్తిదారు సంస్థ నిర్వహణ కొరకు ఒక ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఒక పుస్తక నిర్వాహకుడు/లు నియమించి వారికి శిక్షణ ఇచ్చి వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేయుచున్నారు.

**ఆర్థిక ప్రణాళిక :** రైతు ఉత్పత్తిదారు సంస్థలు తాము అమలు చేసే వివిధ రకాల వ్యాపార కార్యక్రమాల కొరకు ఆర్థిక ప్రణాళికలు తయారు చేసుకొని కావలసిన ఆర్థిక వనరులను వివిధ రకాల మార్గాల ద్వారా పొందుచున్నారు. అవి ముఖ్యంగా సభ్యులనుండి వాటాధనం, కేంద్ర ప్రభుత్వము నుండి రైతు ఉత్పత్తిదారు సంస్థ నిర్వహణ నిధులు మరియు వ్యాపారం కొరకు ఈక్విటి గ్రాంట్‌లు, రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల ద్వారా సబ్సిడీ / మ్యాచింగ్ గ్రాంట్‌లు మొదలగు వాటిని అంది పుచ్చుకోవడానికి ప్రయత్నం చేయవలెను.

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రగతి:**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 28 రైతు ఉత్పత్తిదారు సంస్థలలో 9 సంస్థలు స్వంత నిధులతో కొనసాగుచున్నవి. ఏపిమాస్ టీం ఈ సంస్థల ఆర్థికస్థితిగతులను పరిశీలించడం జరిగింది.

| క్ర. సం. | సంస్థ పేరు | 2022–23 ఆర్థిక సంవత్సరంలో మిగులు | ఇప్పటివరకు మిగులు |
|---|---|---|---|
| 1. | నిమ్మనపల్లి ఎఫ్.పి.సి. | 51518 | 981676 |
| 2. | వాల్మీకిపురం ఎఫ్.పి.ఓ | 71791 | 655091 |
| 3. | మర్యాదరామన్నపట్నం ఎఫ్.పి.సి. మదనపల్లి | 66731 | 432010 |
| 4. | కలికిరి ఎఫ్.పి.ఓ | 68674 | 508272 |
| 5. | ఎం టమేటా ఎఫ్.పి.సి. మదనపల్లి | 22644 | 481777 |
| 6. | వి.కోట ఎఫ్.పి.ఓ | –200856 | 1304458 |
| 7. | కౌండిన్య ఎఫ్.పి.సి. పలమనేరు | –49709 | 267246 |
| 8. | కురబలకోట ఎఫ్.పి.ఓ | –289723 | 145821 |
| 9. | రామసముద్రం ఎఫ్.పి.ఓ | –179792 | 471468 |

పై పట్టికను పరిశీలించినట్లయితే మొదటి ఇదు సంస్థలు 2022-23 ఆర్థిక సంవత్సరంలో మిగులుతో పాటు సంస్థ ప్రారంభం నుండి ఇప్పటివరకు చూసినట్లయితే కూడా సంచిత మిగులు కనిపించుచున్నది. ప్రతి సంవత్సరం మిగులు ఉన్నట్లయితే ఆ మిగులును సంస్థల సుస్థిరతకు చిహ్నంగా చెప్పవచ్చును.

**కూర్చొని తింటే కొండలైనా కరుగుతాయి :** "కూర్చోని తింటే కొండలైనా కరుగుతాయి" అని పెద్దల నానుడి, అందువలన సంచిత మిగులు వున్నప్పటికీనీ ప్రతి సంవత్సరం మిగులు వుండే విధంగా చూడకపోతే సంచిత మిగులు కాస్త కరిగిపోయి సంస్థ నష్టాల ఊబిలోనికి వెళ్ళే ప్రమాదం వున్నది. అందువలన ప్రతి సంవత్సరం లాభాలు వచ్చేవిధంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాలి.

**రోలింగ్ ప్రణాళిక అవశ్యం :** రైతు ఉత్పత్తిదారు సంస్థలు వాటి వార్షిక ప్రణాళికలను ప్రతి త్రైమాసికమునకు ఒకసారి లక్ష్యం , ప్రగతిని సమీక్షించి లక్ష్య సాధనలో వెనుకబడితే ప్రణాళికను ఎప్పటికప్పుడు సవరించుకొని రైతు సంస్థలను సుస్థిరత దిశగా ముందుకు నడిపించడానికి రోలింగ్ ప్రణాళిక ఉపయోగపడుతుంది.

**రోలింగ్ ప్రణాళిక అవశ్యం :** ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థవారి సౌలభ్యంను బట్టి సంవత్సరం, మూడు సంవత్సరాలు, ఐదు సంవత్సరాల కొరకు వ్యాపార అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకొని వాటిని తిరిగి మాసము, త్రై మాసకము, అర్ధ సంవత్సరం మొదలగు విరామాలుగా విభజించుకొని కార్యక్రమాలను అమలుచేయడం జరుగుచున్నది. అయితే నిర్ణీత లక్ష్యం నెరవేరనప్పుడు పునరాలోచించడం లేదు. అందువలన సంస్థలు నష్టాల వైపు వెళుచున్నవి. కావున ప్రతి సంస్థ కూడా ప్రతి నెల వ్యయ మరియు ఆదాయాలను సరిచూచుకొని వ్యయాలకు తగ్గట్టు ఆదాయమును సమకూర్చుకోవలెను. ప్రతి నెల కాకపోయినా ప్రతి మూడు నెలలకు ఒకసారి మూడు నెలల నిర్దేశిత లక్ష్యం మరియు సాధించిన ప్రగతిని మదింపు చేసుకొని, ఒకవేళ నిర్దేశిత లక్ష్యం సాధించనట్లయితే ప్రణాళికను సమీక్షించి


**ఆ**ర్థిక సుస్థిరతకు ప్రతి రైతు సంస్థ తమ వ్యయ - ఆదాయాలను నాలుగు విధాలుగా ప్రాధాన్యత క్రమంలో విశ్లేషించుకొని ముందుగు సాగాలి. అవి...

1. ప్రతి నెల ఆదాయ వ్యయాలు విశ్లేషించుకొనుట
2. ప్రతి త్రైమాసికము ఒకసారి విశ్లేషించుకొనుట
3. ప్రతి అర్థ సంవత్సరం కొకసారి
4. ప్రతి ఆర్థిక సంవత్సరం కొకసారి

అయితే మొదటి లేదా రెండవ పద్ధతి చాలా మంచిది

సవరించుకొని అమలు చేయవలసిన అవసరమును ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా గుర్తించాలి. అప్పుడే సమర్థవంతమైన ప్రణాళికలతో రైతు ఉత్పత్తిదారు సంస్థలు సుస్థిరత దిశగా ముందుగు సాగుతాయి.

ఈ విషయమును ప్రోత్సాహక సంస్థలు గుర్తించి రైతు ఉత్పత్తిదారు సంస్థల పాలకవర్గ సమావేశములలో నిరంతరంగా చర్చించి తోడ్పాటు అందించవలసిన అవసరం వున్నది. వాటితో పాటు దాత సంస్థలు కూడా తమ ప్రాధాన్యతలలో ఉంచి ప్రోత్సాహక సంస్థలకు నిర్దేశించ వలసిన అవసరం వున్నది. కావున ప్రతి రైతు ఉత్పత్తిదారు సంస్థ కూడా రోలింగ్ ప్రణాళిక ఆవశ్యకతను గుర్తించి ఆర్థిక సుస్థిరత దిశగా అడుగులు వేస్తాయని ఆశిద్దాం. ■



# కర్నూలు క్లస్టర్‌లో వాష్ కార్యక్రమాలు ... అనుభవాలు !

–షణ్ముఖ





**గత** రెండు సంవత్సరాలుగా కర్నూలు జిల్లాలో సెర్ప్ , మెప్మా సహకారంతో ఏపిమాస్ వాష్ కార్యక్రమాలను చేపడుతోంది.

నా పేరు షణ్ముఖ. నేను కర్నూల్ క్లస్టర్ కో–ఆర్డినేటర్‌గా వాష్ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నాను. ఈ కార్యక్రమంలో భాగంగా నీరు పారిశుద్ధ్యం, పరిశుభ్రతపైన స్వయం సహాయ సంఘాలకు అవగాహన కల్పించి వారు తీసుకునే రుణాలను వాష్ సదుపాయాలు మెరుగుపరుచుకోవడం కోసం ఉపయోగించేలా వారిని ప్రోత్సాహిస్తాము. ఇలా అవగాహన కల్పించడంలో వి ఓ ఏ లు, ఆర్ పీ లు కీలకపాత్ర పోషిస్తారు. వారికి ఈ అంశాలపైన శిక్షణ యిచ్చి సంఘాలలో ఉండే మహిళలకు అవగాహన కల్పించి వారు రుణాలు పొందడంలో సహకరించేలా చేయడం ఈ కార్యక్రమం విధానం.

దీనికోసం కర్నూలు జిల్లాలో ప్రతి అర్బన్‌లో ఉన్న మున్సిపాలిటీల ఆర్పీలను అనుసంధానం చేస్తూ నీరు , పారిశుధ్యం కార్యక్రమంలో భాగంగా నేను కర్నూలు జిల్లా మెప్మా పీడీ రాధిక గారిని కలవడం జరిగింది. వాష్ కార్యక్రమం గురించి పీడీ గారికి పూర్తిగా వివరించాను. జరిగింది. కరోనా టైంలో కూడా ఒకరోజు 30 మందికి వాష్ శిక్షణ యివ్వడానికి అనుమతి ఇచ్చారు. అలాగే మహిళా దినోత్సవం సందర్భంగా కొన్ని యు.ఎల్.బి లలో ఏపీమాస్ తరపున నన్నుకూడా ఒక అతిథిలాగా పిలిచారు. ఈ కార్యక్రమంకి వెళ్లి మహిళా దినోత్సవం విశిష్టత , ఏపీమాస్ ఎఫ్ ఇ ఓలతో చేసే కార్యక్రమాలను కూడా వివరించాను.

కర్నూలు అప్పటి పిడి రాధిక గారు మొదట డోన్ పట్టణంలో వాష్ శిక్షణ నిర్వహించాలని చెప్పారు.

డోన్ సి ఎం ఎం గారితో ఒక్కరోజు వాష్ శిక్షణకు అనుమతి తీసుకొని వాష్ శిక్షణ నిర్వహించాము. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ , ఆర్పీలు పాల్గొన్నారు.

ఇలా ఆళ్లగడ్డ , గూడూరు అలాగే నందికొట్కూరు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల అర్బన్ పట్టణాలలో నీరు, పారిశుద్ధ్యం , పరిశుభ్రత కార్యక్రమాన్ని అన్నిచోట్ల క్రమబద్ధంగా నిర్వహించాము.

సెర్ప్ వారితో కూడా కలసి, నీరు పారిశుధ్యం , పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాలని డి ఆర్ డి ఏ ఎండి గారిని కలుసుకున్నాను. డి ఆర్ డి ఏ ఆమోదం తర్వాత ఒక్కరోజు వాష్ శిక్షణ నిర్వహించాలని అనుకున్నాము. నెల తర్వాత డి ఆర్ డి ఏ ద్వారా కర్నూలులో, నంద్యాలలోని కొన్ని మోడల్ మండలాలలో కార్యక్రమాలు మొదలు పెట్టాలని సూచించారు.

గెలవడం నీ బాధ్యత కాదు, కాని గెలుపుబాటలో ఒకరోజును మించి మరో రోజు కృషిచేయడం నీ బాధ్యతే



మోడల్ మండలాలలో శిక్షణ నిర్వహణ అనుమతి కోసం కర్నూలు, నంద్యాల డి ఆర్ డి ఏ పిడి గారిని , ఏపిడి గారిని నంద్యాల జిల్లాస్థాయి మహిళా బిఓడి మీటింగ్‌లో కలుసుకున్నాను. అక్కడ పిడి శ్రీధర్ గారు , నంద్యాల హెచ్ డి గారైన పుణ్యవతి గారు ఏపిమాస్ శిక్షణలకు సహకరించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు.

డోన్‌లో వాష్ లోన్‌కి సంబంధించి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహమ్మద్ అలీ గారిని కలుసుకున్నాం. మేనేజర్ గారు స్పందిస్తూ డాక్యుమెంటేషన్ అంతా సరిగా ఉంటే వాష్ లోన్ మంజూరుచేస్తామని చెప్పారు. కాని ఒక్క వాషు రుణం కూడా మంజూరు కాలేదు. ఈ విషయమై యూనియన్ బ్యాంక్ మేనేజర్ గారిని కలిశాము కానీ ఆయన నుంచి స్పందన లేనందున మరి రీజియనల్ మేనేజర్ గారితో ఫోన్లో మాట్లాడడం జరిగిందియీ లోగా అక్కడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీ మహమ్మద్ అలీ డోన్ నుంచి వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు.

మొదట పత్తికొండలో డి ఆర్ డి ఏ ఆఫీస్‌లో వాష్ శ్రిక్షణ నిర్వహించడం జరిగింది. తర్వాత తుగ్గిలి వెలుగు ఆఫీస్‌లో రెండవ శిక్షణ నిర్వహించాము. ఇలా నీరు పారిశుద్ధ్యం, పరిశుభ్రత , పోషకాహార విలువల గూర్చి అక్కడి సభ్యులకు తెలియజేయడం జరిగింది. అలాగే సి డబ్ల్యూ పి పి వాటర్ ప్లాంట్ , ఎడి , ఏ ఎఫ్ టి టాయిలెట్ డీటెయిల్స్‌గా స్లైడ్ రూపంలో ప్రొజెక్టర్ ద్వారా చూపించాము. కార్యక్రమాలు మోడల్ మండలాలు ప్యాపిలి, జూపాడుబంగ్లా, సిరివెళ్ల, చిప్పగిరిలలో ఒకరోజు శిక్షణ నిర్వహించాము.

కొన్ని మోడల్ మండలాల్లో శిక్షణ నిర్వహించిన తర్వాత సిడబ్ల్యూపి వాటర్ ప్లాంట్ కు సంబంధించి ఏపిమాస్ పూర్తి ఉచితంగా యిస్తుందని , ఖర్చంతా తానే భరిస్తుందని అవగాహనా రాహిత్యంతో అనుకున్నారు. వారిఅపోహలను నివృత్తిచేయడంకోసం, నెలవారి సమావేశాలకు వెళ్లి పూర్తి వివరాలు తెలిపాము.

డోన్ లో పునశ్చరణ శిక్షణ నిర్వహించాము ఈ శిక్షణలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్త శైలేష్ గారు , మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డిగారు మెప్మా సి ఎం ఎం సుజాత గారు సి ఓ జయంతి గారు, ఆర్పీలు పాల్గొన్నారు .

ప్రతి నెల వాష్ సంబంధిత ఇతర కార్యక్రమాలు ఉంటే ఏపీమాస్ తరఫున మేము కూడా పాల్గొంటున్నాము ఏపీ మెప్మా ఎండి శ్రీమతి విజయలక్ష్మి కర్నూలు పట్టణానికి వచ్చినప్పుడు వాష్ ప్రోగ్రాం తరఫున ఆమెను, హెచ్ఎం శ్రీనివాస్ గారిని కలిసి జిల్లాలో జరిగే నీరు పారిశుద్ధం పరిశుభ్రత కార్యక్రమాన్ని గురించి వివరించాము.

గూడూరు పట్టణంలో మహిళా దినోత్సవం రోజు వాష్ శిక్షణ నిర్వహించాము. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు పట్టణ చైర్మన్ భార్య లక్ష్మీదేవి గారు వచ్చారు.

నంద్యాల పట్టణంలో ఒక్కరోజు వాష్ శిక్షణ కార్యక్రమానికి ఏపీమాస్ ఎఫ్ఈఓ ప్రెసిడెంట్ హాజరయ్యారు. ■

# ఈ పోలీసు ఆరువేలమందిని చదివిస్తున్నాడు!



**నే**రం రెండు రకాలు. ఒకటి, తెలిసి చేయడం. రెండోది – తెలియకుండానే అందులోకి దిగడం. 'ఓ పోలీసన్నవాడు మొదటిదాన్ని క్రిమినల్ చట్టాల కోణం నుంచి చూడాలి. రెండోదాని విషయంలో అత్యంత సామాజిక బాధ్యతతో మెలగాలి' అంటాడు ఈ ఐపీఎస్ అధికారి. అనడమే కాదు– సామాజిక స్పృహ అంటే ఏమిటో ప్రపంచానికి చాటుతున్నాడు. ఆరువేలమంది ఆడపిల్లల్ని చదివిస్తున్నాడు! వాళ్ళలో వందమందిదాకా ఇప్పటికే పట్టభద్రులయ్యారు. ఇంతకీ ఎవరా ఆడపిల్లలు..?

2007లో జరిగిందీ సంఘటన, మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్ ఠాణా పోలీసు ఇన్స్పెక్టర్ రవీంద్ర మిశ్ర తమకి దగ్గర్లోని ఓ ఆదివాసి గూడేనికి వెళ్ళాడు. అక్కడో ఇంటి ముందు మంచంమీద ఓ పెద్దావిడా, ఆవిడ కూతురూ, మనవరాలూ కూర్చుని ఉన్నారు. సివిల్ డ్రెస్‌లో ఉన్న ఈయన్ని చూసిన వాళ్ళు బాబూ... బైఠేగా క్యా? (కూర్చుంటారా? )' అని అడిగారు. అది అక్కడి ఆదివాసీ మహిళలు విటుల్ని చూసి పిలిచే పిలుపు! అది కాదు... మొదటిసారి పెద్దావిడన్న అదే మాటని పద్నాలుగేళ్ళ మనవరాలు కూడా అమాయకంగా వల్లెవేయడం... అది వీరేంద్రని నిలువెల్లా వణికిపోయేలా చేసింది. 'ఇంత చిన్నపిల్లనీ ఈ నరకంలోకి దించారేమిటీ? అని అడిగితే– "చేయించకపోతే మా ఆకలి ఎలా తీరుతుంది?" అని ఎదురు ప్రశ్నించిందా తల్లి. ఆ మాటలకి తానొక పోలీసు ఆఫీసర్నన్న విషయం కూడా మరచిపోయి కన్నీళ్ళు పెట్టుకున్నాడాయన... ఆ చిన్నారికి తన కూతురి వయస్సుంటుందేమో! అంతే– ఏదో ఉద్వేగంతో 'ఈ పాపని నేను దత్తత తీసుకుంటాను. ఇవ్వండి... " అన్నాడు.. అది విని గూడెం పెద్దవాళ్ళు వచ్చి గొడవపెట్టుకుని అతణ్ని పంపించేశారు.

ఇంటికొచ్చినా ముక్కు పచ్చలారని ఆ పాపే అతని కళ్ళలో మెదలసాగింది. 'మీరు మరీ సున్నితం సార్! బేడియా ఆదివాసీల్లో అరవై ఏళ్ళుగా సాగుతున్న వృత్తి ఇది. మేమెన్నోసార్లు వాళ్ళని అరెస్టు చేశాం... అయినా లాభంలేదు. మీరూ వదిలెయ్యండి!' అన్నారట సహచర పోలీసులు. అందులో నిజం లేకపోలేదు....

**మూడు తరాల ఘోరం!**

బేడియా.... చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ లో కనిపించే ఓ గిరిజన తెగ, ఒకప్పుడు నాట్యకళాకారులుగా గొప్ప పేరు. గడించినవారు వీళ్ళు. కానీ– బ్రిటిష్ వాళ్ళ కాలంలో సిపాయి తిరుగుబాటప్పుడు విప్లవకారులకి సాయం చేశారట. దాంతో





**ఆ పాపతో మొదలు**

ఓరోజు బేడియా గూడెం నుంచి పదమూడేళ్ళున్న ఒక పాప రవీంద్రని వెతుక్కుంటూ వచ్చింది. 'మీరు' నాలాంటి వాళ్ళని చదివిస్తానంటున్నారు కదా! నేను మీతో వస్తాను'' అంది. "నువ్వొక్కదానివేనా... ఇంకెవ్వరూ రారా! అన్నారాయన. ఆమె తన స్నేహితురాళ్ళని చూపింది. అలా 13 మందిని ఎంపిక చేసి– అతికష్టంపైన వాళ్ళ పెద్దల్ని ఒప్పించి మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్‌లోని బడుల్లో చేర్పించాడు మిశ్ర. తాను స్థాపించిన 'సంవేదన' అన్న ఎన్జీఓ ద్వారా వాళ్ళ ఆలనాపాలనా చూడసాగాడు. వాళ్ళనే ఉదాహరణగా చూపించి ఇతర జిల్లాల్లోని ఈ తెగ ప్రజల్లో కదలిక తెచ్చాడు. మధ్యప్రదేశ్‌లోని బడులన్నింటా చైతన్య కార్యక్రమాలు నిర్వహించి ఆ పిల్లలపైన వివక్షను రూపుమాపాడు. ఆ ప్రయత్నాలు అద్భుతాలే చేశాయి. ఆయన బడుల్లో చేర్చిన పిల్లల్లో దాదాపు వందమంది పట్టభద్రులయ్యారు. తన వృత్తికి అతీతంగా రవీంద్ర మిశ్ర చేసిన కృషిని ఐక్యరాజ్యసమితి గుర్తించింది. పడుపు వృత్తి ఎక్కువగా ఉన్న కొసావో, బోస్నియా దేశాలకి పంపిన ప్రత్యేక బృందంలో ఆయన్ని భాగస్వామిని చేసింది. ప్రస్తుతం. మధ్యప్రదేశ్లోని ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(ఐఎస్ఎఫ్) విభాగంలో ఏఐజీగా ఉంటున్న రవీంద్ర మిశ్ర... తన సంవేదన ఎన్జీఓ ద్వారా ఆరువేలమందిని చదివిస్తున్నాడు!

బ్రిటిష్ ప్రభుత్వం ఈ తెగని 'నేరస్థ జాతి'గా (నోటిఫైడ్ ట్రైబ్) ప్రకటించింది. వీళ్ళ భూముల్ని లాక్కుని అడవుల్లోకి తరిమేసింది. అప్పటికి మధ్యప్రదేశ్‌లోని సంస్థానాధీశులు కొందరు వీళ్ళని చేరదీశారు. కానీ స్వాతంత్ర్యం వచ్చి రాచరికాలు రద్దయ్యాక ఆ ఆదరణా కరవైంది. వేరేదారి తెలియక తమ అందాన్నే పెట్టుబడిగా పెట్టి ఆడవాళ్ళు వ్యభిచారంలోకి దిగారు. మరే వృత్తీ చేయలేని మగవాళ్ళు వాళ్ళకి సాయం చేయడం మొదలు పెట్టారు. ఆడవాళ్ళకి పెళ్ళిళ్ళవుతాయి కానీ అది పేరుకే పుట్టే పిల్లలకి భర్త బాధ్యత తీసుకోడు. తండ్రెవరో తెలియని ఈ ఆడపిల్లల్ని బడిలో చేర్చినా– ఉపాధ్యాయులు వాళ్ళపక్కన మిగతా విద్యార్థుల్ని కూర్చోబెట్టరు. కనీసం వీళ్ళని మంచినీళ్ళయినా ముట్టుకోనివ్వరు. ఈ వివక్షని తట్టుకోలేని పిల్లలు ఇంటికే పరిమితమవుతారు. పడుపు వృత్తిలోకే దిగుతారు. మధ్యప్రదేశ్ రాయ్‌గర్ జిల్లాలోని నర్సింగ్‌గఢ్ పట్టణం చుట్టుపక్కలున్న బేడియా తెగ ప్రజల ఈ దుస్థితిని మార్చాలనుకున్నాడు రవీంద్ర మిశ్ర. కానీ అందరు పోలీసుల్లా క్రిమినల్ చట్టంతో కాకుండా సామాజిక స్పృహతో ఆ పని చేయాలనుకున్నాడు. గూడేలకి వెళ్ళి చదువు విలువని చెప్పసాగాడు. ఆ మాటల్ని పెద్దలు పట్టించుకోకున్నా పిల్లలు విన్నారు...

అన్నట్టు రవీంద్ర దగ్గరకి తొలిసారి చదువుకుంటానంటూ వచ్చిన పాప ఎంటెక్ ముగించింది. ఈమధ్యే సివిల్ సర్వీసస్ ఇంటర్వ్యూకి హాజరై... ఫలితాల కోసం ఎదురుచూస్తోంది. అవకాశం వస్తే తన గురువు రవీంద్రతో కలిసి పని చేస్తానంటోంది! ■

నేటి నీ బాధ్యతను విస్మరిస్తే రేపటి రోజున దోషిగా నిలవక తప్పదు, జవాబు చెప్పుకోక తప్పదు

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు శాసనంగా మారడానికి లాంఛనాలన్నీ పూర్తయ్యాయి. దాదాపు ఏకగ్రీవంగా లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభ ఏకగ్రీవ ఆమోదం, రాష్ట్రపతి ఆమోదంకూడా పొందడంతో యిక గెజిట్ నోటిఫికేషన్ మాత్రమే మిగిలి వుంది. చరిత్రాత్మకమైన ఈ బిల్లు కొత్త పార్లమెంటు భవనంలో శాసనరూపం దాల్చుతున్న మొదటిబిల్లు కానుంది.

లోక్ సభలో దాదాపు ఏకగ్రీవంగా ఈ బిల్లు ఆమోదం పొందింది. 454 మంది ఎంపీలు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా.. ఇద్దరు (మజ్లిస్ ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, ఇంతియాజ్ జలీల్) సభ్యులు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు.

"నారీ శక్తి వందన్ అధినియమ్" పేరుతో మోదీ సర్కారు రూపొందించిన ఈ బిల్లు.. కొత్త పార్లమెంటు భవనంలో ప్రవేశపెట్టిన తొలి బిల్లు. బిల్లుపై తొలుత ఎనిమిది గంటల పాటు చర్చ జరిగింది. ఆ చర్చలో అధికార, విపక్షాలకు చెందిన 60 మంది ఎంపీలు పాల్గొని .... పరస్పర వాగ్బాణాలు సంధించుకున్నారు.

లోక్‌సభలో 543 మంది ఎంపీలుండగా.. వారిలో 82 మంది మహిళలు. వారిలో.. సోనియాగాంధీ, స్మృతి ఇరానీ సహా 27 మంది మహిళా ఎంపీలు బుధవారంనాటి చర్చలో పాల్గొన్నారు. బిల్లుకు మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఓబీసీలకు సబ్ కోటా కల్పించాలని, బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసింది. పలువురు ప్రతిపక్ష ఎంపీలు.. ఈ బిల్లు అమలుకు కుల గణన, డీలిమిటేషన్ అవసరం ఏముందని ప్రశ్నించారు.

**ఓటింగ్ ఇలా..**

నంబర్ 367 ప్రకారం.. సభకు హాజరైన సభ్యులందరికీ ఆయెస్, నో అని రాసి ఉన్న కాగితం స్లిప్పులు పంచారు. ఆకుపచ్చ రంగు స్లిప్పులపై ఆయెస్ అని ముద్రించి ఉండగా.. ఎర్ర రంగు స్లిప్పులపై నో అని ముద్రించి ఉంది.

బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే ఎంపీలు ఆకుపచ్చరంగు స్లిప్పుపై తమ పేరు, ఐడెంటిటీ కార్డు నంబర్, తమ నియోజకవర్గం పేరు రాసి, సంతకం చేయాల్సి ఉంటుంది. అదే కోవలో.. వ్యతిరేకించేవారు 'నో' అని ముద్రించి ఉన్న ఎరుపు రంగు కాగితంపై ఆ వివరాలు రాయాల్సి ఉంటుంది. ఓటింగ్‌కు దూరంగా ఉండాలనుకునే సభ్యులు తమ వివరాలను పసుపు రంగు కాగితంపై రాయాల్సి ఉంటుంది.

అనంతరం.. మూడింట రెండొంతుల మెజారిటీతో బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అసదుద్దీన్ ఒవైసీ, ఎన్‌కే ప్రేమచంద్రన్, సౌగతరాయ్, ఏఎం ఆరిఫ్, ఈటీ మొహమ్మద్ బషీర్ వంటివారు ఈ బిల్లుకు సవరణలు ప్రతిపాదించారు.

**రాజ్యసభ ఆమోదం**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మహిళా బిల్లుపై రాజ్యసభలో 10 గంటలకు పైగా చర్చ జరిగింది. ఇప్పటికే లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం పొందింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా సభలోని మొత్తం 215 ఓట్లు వచ్చాయి.

**రాష్ట్రపతి ఆమోద ముద్ర**


దేశంలోని మహిళల మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. 'నారీ శక్తి వందన్ అధినియం' పేరుతో మోదీ సర్కారు రూపొందించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2023 సెప్టెంబరు 29న ఆమోద ముద్ర వేశారు. ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం పొందిన ఈ బిల్లు.. ప్రెసిడెంట్ సంతకంతో చట్టంగా మారింది. ■

నీవు నడిచే దారి నీకు నచ్చకపోతే మరో మెరుగైన దారిని నిర్మించే బాధ్యతను నీవే తీసుకో

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-10-2023 ; Posting Date: 05 & 06-10-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## మదురైలో ఎఫ్ పి ఓలతో ఎస్ బి ఐ అనుసంధాన సదస్సు ... మరికొన్ని దృశ్యాలు





## ఏపిమాస్ ఎఫ్ పి ఓల వార్షిక మహాసభల దృశ్యాలు !




ఆజీవ ఎఫ్ పి ఓ ...



సోమల ఎఫ్ పి ఓ



భూసంపద ఎఫ్ పి సి ...



ఎమ్మిగనూరు రైతుస్వరాజ్యం ఎఫ్ పి సి ...



పెండ్లిమర్రి ఎఫ్ పి ఓ



ధీశాలి ఎఫ్ పి సి ...




ధరణి ఎఫ్ పి ఓ

To ADDRESS



ఏ ఆర్ పల్లి ఎఫ్ పి ఓలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎం ఎల్ ఏ